## ప్రభుత్వం రూ.154 కోట్ల బకాయిలు విడుదల చేయాలి

-గిరిజన సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్‌నాయక్

**షాద్‌నగర్, జూన్ 16, ప్రభాతవార్త:**

దళిత, గిరిజన పేదవిద్యార్థులు ప్రైవేటు స్కూళ్లలో ఉచితంగా చదివేందుకు 35ఏళ్ల క్రితం ప్రవేశపెట్టిన బెస్ట్ ఎవైలబుల్ పథకం ద్వారా అనుమతిపొందిన ప్రైవేటు పాఠశాలల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రభుత్వమే ఫీజులు చెల్లించేదని, కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈపథకానికి ఆటంకం కల్పిస్తుందని తెలంగాణ గిరిజన సంక్షేమ సంఘం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్‌నాయక్ ఒక ప్రకటనలో ఆరోపించారు. గతరెండేళ్లుగా రాష్ట్రప్రభుత్వం ఫీజుబకాయిలు చెల్లించలేదని, వెంటనే ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో చర్చలు జరిపి రూ.154 కోట్ల బకాయిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. పేద దళిత, గిరిజన విద్యార్థుల ఫీజులుచెల్లించకపోవడం దళితులు, గిరిజనుల పట్ల తీవ్రవివక్ష పాటించడమేనని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే బకాయిలను చెల్లించాలని లేకపోతే దళిత, గిరిజన సంఘాలు, విద్యార్థి సంఘాలను కలుపుకొని రాష్ట్రవ్యాప్త ఉద్యమాలు చేపడతామని ఈశ్వర్‌నాయక్ హెచ్చరించారు.

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

## రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

**షాబాద్, జూన్ 16, ప్రభాతవార్త:**

కాంగ్రెస్‌ప్రభుత్వం రైతుసంక్షేమానికి పెద్దపీట వేస్తుందని సర్దార్‌నగర్ ఎఎంసి చైర్మన్ పీసరి సురేందర్ రెడ్డి, గుడిమల్కాపూర్ ఎఎంసి వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండలంలోని తాళ్లపల్లి, మాచన్‌పల్లి, షాబాద్ రైతువేదికల్లో రైతునేస్తం పథకంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇందిరమ్మరాజ్యంలో రైతుసంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ, రైతుభరోసాతో రైతులకు న్యాయం చేశామన్నారు. భూభారతి చట్టం తీసుకువచ్చి చైతుల సమస్యలు తీర్చిందన్నారు. రైతులకు ఎకరాకు రూ. 6వేలు అకౌంట్‌లో ప్రభుత్వం జమచేస్తుందన్నారు. రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో గెలుపే లక్ష ్యంగా ముందుకు పోదామన్నారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ అన్వర్, ఎంపిడివో అపర్ణ, ఎఓ వెంకటేశం, పిఎసిఎస్ వైస్‌చైర్మన్ మల్లేష్, మాజీ సర్పంచులు ఖాజామియా పటేల్, జనార్దన్‌రెడ్డి, లింగం, సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను మంజూరు చేయండి

-ఎంపికి వినతిపత్రం అందించిన బిజెపి నాయకులు



ఎంపికి వినతిపత్రం అందిస్తున్న బిజెపి నాయకులు

**కొందుర్గు, ప్రభాతవార్త, జూన్ 16:**

కొందుర్గు మండలానికి అవసరమైన అభివృద్ధి పనులను మంజూరు చేయాలని కోరుతూ బిజెపి నాయకులు మహబూబ్‌నగర్ ఎంపి డికె అరుణను కలిసి వినతిపత్రం అందించారు. సోమవారం బిజెపి మండలశాఖ అధ్యక్షుడు చిట్టెం లక్ష్మీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో షాద్‌నగర్ పట్టణంలోని బిజెపి కార్యాలయంలో ఎంపి డికె అరుణను కలుసుకొని మాట్లాడారు. వినతిపత్రం అందించిన వారిలో బిజెపినాయకులు రామకృష్ణారెడ్డి, గుండేటి శివారెడ్డి, తూంపల్లి సత్యనారాయణరెడ్డి, యాదయ్య, తదితరులు ఉన్నారు.

## విధులను బహిష్కరించిన న్యాయవాదులు



విధులను బహిష్కరించి నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

**వికారాబాద్, జూన్ 16, ప్రభాతవార్త:**

న్యాయవాదులపై జరిగిన దాడిని నిరసిస్తూ వికారాబాద్ జిల్లా కోర్టు న్యాయవాదుల సంఘం సోమవారం విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఈనెల 14న హైదరాబాద్‌లోని సిటీ సివిల్ కోర్టుకు సంబంధించిన న్యాయవాదులు పి.నారాయణ, శైలేష్ సక్సేనాలపై దారుణంగా దాడిజరిగిన నేపథ్యంలో న్యాయవాదులపై నిరంతరం జరుగుతున్న దాడులన ు నిరసిస్తూ వికారాబాద్ జిల్లాకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.బస్వరాజు ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ సభ్యులు విధులు బహిష్కరణచేసి నిరసన తెలిపారు. ఈసందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బస్వరాజ్ మాట్లాడుతూ, న్యాయవాదుల రక్షణచట్టం సత్వరమే తీసుకొచ్చి న్యాయవాదులు వారి వ్యక్తిగతమైన ప నులకోసం వాళ్ళ జీవితాన్ని ఫణంగా పెట్టట్లేదని అన్నారు. సమాజంలో ఉన్నటువంటి రుగ్మతల విషయమై సామా న్యుడికి న్యాయంకోసం కొట్లాడే కార్యక్రమంలో వాళ్ల విధుల నిర్వహణకు అడ్డుపడి వాళ్ళపైన చేస్తున్న దాడులకు నిరసనగా ఈ బంద్‌కు పిలుపు ఇవ్వడం జరిగిందని తెలిపారు. తక్షణమే న్యాయవాదుల రక్షణచట్టం తెచ్చి వాళ్ళకి న్యాయం చేయాల్సిందిగా ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ పి.వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ఎ.శంకరయ్య, జాయింట్ సెక్రెటరీ పి.ఆనంద్, సీనియర్ న్యాయవాదులు కమల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, లవకుమార్, బి.మాధవరెడ్డి, జిల్లా లీగల్ సేల్ చైర్మన్ టి.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను గౌరవించాలి

-జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్



విద్యార్థులతో ముచ్చటిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్

**వికారాబాద్, జూన్ 16, ప్రభాతవార్త:**

మీకు చదువు చెప్పడానికి వచ్చే ఉపాధ్యాయుల ను, మీతల్లిదండ్రుల ను గౌరవించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ విద్యార్థులకు సూచించారు. సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికలు, వికారాబాద్ నందు నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎఫ్ఎల్ఎన్, ఎల్ఐపి కార్యక్రమాల నిర్వహణ గురించి ఏర్పాటుచేసిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిప్రజల్వన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చదువు చెప్పే ఉపాధ్యాయులను గౌరవించాలని, సమాజంలో ఉజ్వల భవిష్యత్తు ఏర్పాడాలంటే విద్యార్థులు అందరు బాగాచదువుకొని ఉన్నతలక్ష్యాలు చేరుకోవాలని సూచించారు. ఎఫ్ఎల్ఎన్, ఎల్ఐపి కార్యక్రమాలు సక్రమంగా అమలు జరిగేలా చూడాలని అన్నారు. ఈకార్యక్రమాలు విద్యార్థులలో తగిన సామర్థ్యాలు పెంపొందించడానికి ఎంతో సహకరిస్తాయని వివరించారు. విద్యార్థులతో మాట్లాడుతూ, విద్యార్థులు ఉన్నతమైన ఆశయాలు, ఉన్నతమైన శిఖరాలు అధిరోహించాలని ఆదిశగా విద్యార్థులందరూ కృషి చేయాలని అన్నారు. విద్యార్థులు చేసిన నృత్యప్రదర్శనను తిలకించిన కలెక్టర్ స్పందించి తమ చిన్ననాటి ఉపాధ్యాయురాలు తారాబాయిని గుర్తు చేసుకున్నారు. ఆమె చదువుచెప్పడం వల్లే తాను ఈస్థాయిలో ఉన్నానని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొన్నారు. ఈసంవత్సరం 10వ తరగతిలో విద్యార్థులు బాగాచదివి 100శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. ఈసందర్భంగా విద్యార్థులకు యూనిఫామ్స్, నోట్ బుక్స్ పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన టిఎల్ఎం స్టాల్స్‌ను సందర్శించి ఆ సామగ్రి తయారుచేసిన ఉపాధ్యాయులు, విద్యార్థులను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రేణుకదేవి, మండల విద్యాధికారి బాబుసింగ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీశైలం, ఎస్ఎంసి చైర్మన్ విజయలక్ష్మి, డిఈఓ కార్యాలయ సిబ్బంది వీరేశం, రామ్‌మస్తానీ, రజనీకుమారి తదితరులు పాల్గొన్నారు.

## శ్మశాన వాటిక ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలని ఎమ్మెల్యేకు వినతి

**మేడ్చల్, జూన్ 16, ప్రభాతవార్త:**

వీరశైవ లింగాయత్‌లకు మేడ్చల్‌లో స్మశానవాటికకు స్థలాన్ని కేటాయించాలని ఆ సంఘం నాయకులు ఎమ్మెల్యే మల్లారెడ్డిని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. మేడ్చల్‌లో తమకు 200 వందల ఇళ్లు ఉన్నాయని, తమ కులస్థులు చనిపోతే పూడ్చిపెట్టడానికి స్థలం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఎమ్మెల్యేకు తెలిపారు. మేడ్చల్ రైల్వే ట్రాక్ వద్ద ఉన్న సర్వేనెంబర్ 343లో ఉన్న 4ఎకరాల స్థలాన్ని కేటాయించాలని వీరశైవలింగాయత్‌లు ఎమ్మెల్యే మల్లారెడ్డిని కోరారు.



ఎమ్మెల్యే మల్లారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వీరశైవ లింగాయత్‌లు

# సైదోనిగడ్డ తండాలోని సమస్యలను పరిష్కరిస్తా

-ఎంపి ఈటల రాజేందర్



సైదోనిగడ్డతండాలో పర్యటిస్తున్న ఎంపి ఈటల రాజేందర్

**మేడ్చల్, జూన్ 16. ప్రభాతవార్త:**

నగరానికి చేరువలో ఉన్న తండాలు సౌకర్యాల లేమితో ఇంకా వెనుకబాటుతనంతో ఉన్నాయని మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ అన్నారు. ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని సైదోనిగడ్డతండాలో సోమవారం ఎంపి ఈటల రాజేందర్ పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. ఈసందర్భంగా తమ తండాలో మురుగునీటి కాలువ సమస్యతోపాటు వీధి లైట్లు లేవని తండావాసులు ఎంపి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ నగరానికి చేరువలో మేడ్చల్‌కు ఆనుకుని ఉన్న సైదోనిగడ్డ తండాలో మురుగునీటి సమస్య, వీధి లైట్ల సమస్య ఉందని అన్నారు. మురుగునీరు పంటపొలాల్లోకి వెళ్లడంతో రైతులు దుక్కి, దున్ని పంట కోయడానికి నానా అవస్థలు పడుతున్నారని అన్నారు. వారి కోరికమేరకు తనను గెలిపించిన ప్రజలరుణం తీర్చుకునేందుకు గాను తండాలోని మురుగునీటి కాలువ సమస్య, వీధి లైట్ల ఏర్పాటుకు కృషిచేస్తానని హామీనిచ్చారు. అనంతరం తండావాసులతో కలిసి వారుచేసిన జొన్నరొట్టెలను ఎంపి భుజించారు. ఈకార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షుడు విక్రంరెడ్డి, సీనియర్‌నాయకుడు నందారెడ్డి, మాజీ ఎంపిపి సుదర్శన్‌రెడ్డి, ఎల్లంపేట్ మున్సిపల్ బిజెపి అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్, మేడ్చల్ మున్సిపల్‌అధ్యక్షురాలు శైలజా హరినాథ్, నాయకులు మల్లికార్జున్‌ముదిరాజ్, జగన్‌గౌడ్, నర్సింహారెడ్డి, తిరుమల్‌రెడ్డి, పుష్పరెడ్డి, మహేష్, కిషన్‌నాయక్, సుజాత, కమిలి, రాజు తదితరులు పాల్గొన్నారు.

**శ్రీరంగవరం గ్రామంలో ఎంపి పర్యటన..**

ఎల్లంపేట్ మున్సిపాలిటీలోని శ్రీరంగవరం గ్రామంలో డబిల్‌పూర్ పిఎసిఎస్ డైరెక్టర్ జీడిపల్లి భూపాల్‌ను మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ పరామర్శించారు. ఇటీవల భూపాల్ తండ్రి పిఎసిఎస్ డైరెక్టర్ భిక్షపతి మృతిచెందగా సోమవారం బిజెపి నాయకులతో కలిసి ఎంపి ఆయన ఇంటికివెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చి పరామర్శించారు.

**గ్రామ పాఠశాల పరిశీలన..**

శ్రీరంగవరం గ్రామానికి వెళ్లిన ఎంపి ఈ సందర్భంగా గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి పరిశీలించారు. ఈసందర్భంగా సమస్యలు అడిగి తెలుసుకుని, సౌకర్యాలు, వసతులు ఎలా ఉన్నాయని పరిశీలించారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయం పనులను పర్యవేక్షించి పనులవివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో బిజెపి మేడ్చల్ జిల్లా మాజీఅధ్యక్షులు విక్రంరెడ్డి, నాయకులు నందారెడ్డి, మల్లికార్జున్‌ముదిరాజ్, శ్రీరంగవరంగ్రామ మాజీ సర్పంచ్ కొర్వి పోచయ్యముదిరాజ్, మాజీవార్డు సభ్యులు జిన్నారం కృష్ణముదిరాజ్, మొలుగు రవిచంద్ర, నాగారం శ్రీశైలం, తలారి ప్రవీణ్, తలారి శ్రీనివాస్, దాది మురళీమోహన్, దాది వెంకట్, ఇండ్ల తరుణ్, లక్ష ్మణ్‌గౌడ్, రుక్మారెడ్డి, ముత్యంగారి రాములు, చింతల రాములు, అంజయ్య, కుమార్, నాగారంరాజు, ప్రదీప్‌గౌడ్, శీలం సాయి, వంశీ, కిరణ్, అవినాష్ పాల్గొన్నారు.

# ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

-ప్రజావాణికి 68 ఫిర్యాదులు

-జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి



ఫిర్యాదులను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి

**రంగారెడ్డిజిల్లాప్రతినిధి హైదరాబాద్, జూన్ 16, ప్రభాతవార్త:**

ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను అధికారులు పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 68 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లాకలెక్టర్ సి.నారాయణరెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులకు సంబంధించిన శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరి ష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ.. వర్షాకాలంలో వచ్చే సీజన్ వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపుకలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహసీల్దార్, కలెక్టరేట్ సూపరింటెండెంట్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## లాభసాటి పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలి

-సిఎం రేవంత్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్సును వీక్షిస్తున్న జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 16, ప్రభాతవార్త:**

లాభ సాటి పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా 1031 రైతువేదికలకు వీడియో కాన్ఫరెన్స్ అ నుసంధానం కార్యక్రమాన్ని సోమవారం లాంఛనంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈకార్యక్రమానికి జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన రైతునేస్తం కార్యక్రమంలోభాగంగా వికారాబాద్ మండలంలోని గొట్టిముక్కల గ్రామంలో రైతువేదికలో నిర్వహించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాకలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపుకలెక్టర్ లింగ్యానాయక్ రైతువేదిక నుంచి హాజరయ్యారు. ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం నుంచి సిఎం రేవంత్‌రెడ్డి 1031 రైతువేదికలో నూతనంగా వీడియో కాన్ఫరెన్స్‌ను డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఇతరమంత్రులు, సిఎస్ కె.రామకృష్ణారావులతో కలిసి ప్రారంభించారు. సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, రైతుల ఆశీర్వాదం లేకపోతే ప్రజాప్రతినిధిగా రాణించలేమని, గ్రామ వార్డు సభ్యుల నుంచి ముఖ్యమంత్రి వరకు ప్రతి ఒక్కరికి రైతు చల్లనిచూపులు అవసరమని అన్నారు. నేడు ప్రజా ప్రభుత్వంలో చివరిగింజ వరకు మద్దతుధర చెల్లించి ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. పేదలకు సన్నబియ్యం రేషన్‌ద్వారా పంపిణీ చేస్తున్నామని అన్నారు. 9రోజులలో రైతులకు రూ.9వేల కోట్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని, 70లక్షల11వేల రైతులకు డబ్బులు బదిలీచేస్తామని అన్నారు. రాబోయే 10సంవత్సరాలలో తెలంగాణరాష్ట్రం 1 ట్రిలియన్ డాలర్ ఎకానమీగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## సంక్షేమ అభివృద్ధి ఫలాలు అర్హులకు అందేలా చూడాలి

-జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 16, ప్రభాతవార్త:**

ప్రభుత్వంప్రవేశపెట్టిన సంక్షేమ అభివృద్ధి పథకాలు ప్రజలకు అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులకు సూచించారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా జిల్లా నలుమూలలనుండి వచ్చిన ప్రజల నుండి జిల్లా ఆదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ఆర్డిఓ వాసు చంద్రలతో కలసి విజ్ఞప్తులు స్వీకరించారు. ఈసందర్భంగా అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో అపరిష్కృతంగా ఉన్న సమస్యల సత్వరపరిష్కారానికి అధికారులు కృషి చేయాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, బడిబాట, ధాన్యం కొనుగోలుకేంద్రాలు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించి పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. చౌకధరల దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. మంజూరు అయిన ఇందిరమ్మ ఇళ్లను గ్రౌండింగ్ చేసి పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ప్రజావాణిలో 84 దరఖాస్తులు రాగా రెవెన్యూ సమస్యలతోపాటు వ్యవసాయ, భూముల సర్వే, పెన్షన్లు, ఆర్టీసీ, ఇళ్ల, రేషన్ కార్డులు మంజూరు తదితర అంశాలపై విజ్ఞప్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు.

## 2.5 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత



పోలీసులు పట్టుకున్న రేషన్ బియ్యం వ్యాన్

**ఘట్‌కేసర్, జూన్ 16, ప్రభాతవార్త:**

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఘట్‌కేసర్ పోలీసులు పట్టుకున్నారు. ఘట్‌కేసర్ ఓఆర్ఆర్ ఎగ్జిట్ 9 వద్ద సోమవారం మధ్యాహ్నం ఘట్‌కేసర్ ఎస్ఐ బి.ప్రభాకర్‌రెడ్డి సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. ఈసమయంలో టాటా ఇంట్రా వాహనం రావడంతో పోలీసులు ఆపి చూడగా అందులో బియ్యంసంచులు ఉన్నాయి. బియ్యం తరలిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా పిడిఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్లు నిర్ధారించారు. రేషన్ కార్డుదారుల నుంచి బియ్యం కొనుగోలు చేసి అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నారు. రెండున్నర టన్నుల రేషన్ బియ్యం ఉండటంతో వ్యాన్‌ను, తుర్కపల్లికి చెందిన భూక్యా కిరణ్, భుక్యా శ్రీకాంత్, తిరుపతిలను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ సాయికుమార్ తెలిపారు.

## సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలి

-జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి



మాట్లాడుతున్న కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి, పాల్గొన్న అదనపు కలెక్టర్లు, డిఆర్ఓ, అధికారుల దృశ్యం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 16, ప్రభాతవార్త:**

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను (అర్జీలను) పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా నూతన కలెక్టర్ తొలిసారిగా పాల్గొని అదనపు కలెక్టర్లు, అధికారులతో కలిసి ప్రజలనుంచి దరఖాస్తులను, వినతులను, ఫిర్యాదులను స్వీకరించారు. కలెక్టరేట్‌లో జరిగిన ఈప్రజావాణి కార్యక్రమంలో జిల్లావ్యాప్తంగా ప్రజల నుంచి 86అర్జీలు అందినట్లు తెలిపారు. అదనపు కలెక్టర్లు రాధికగుప్తా, విజయేందర్‌రెడ్డి, డిఆర్ఓ హరిప్రియలతో కలిసి కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు. ఈసందర్భంగా జిల్లాకలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ఎంతో వ్యయప్రయాసలకోర్చుకుని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు కలెక్టరేట్‌కు వస్తారని ప్రజావాణిలో అర్జీలను అందజేస్తారని, వారినమ్మకాన్ని అధికారులు నిలబెట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. తిరస్కరించే దరఖాస్తులను ఎందుకు తిరస్కరించామనే విషయాన్ని అర్జీదారులకు వివరంగా తెలియజేయాలని, స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్‌లైన్‌లో వెంటనే నమోదు చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపుకలెక్టర్లు రాధికగుప్తా, విజయేందర్‌రెడ్డి, డిఆర్ఓ హరిప్రియ, జిల్లా లా ఆఫీసర్ చంద్రావతి, వివిధశాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**కలెక్టర్‌ను కలిసి సన్మానించిన ఎఎంసిచైర్మన్ బి.నర్సింలు యాదవ్, పాల్గొన్న నాయకులు..**

**శామీర్‌పేట, జూన్ 16, ప్రభాతవార్త:**

మేడ్చల్ జిల్లా నూతన కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరిని మేడ్చల్ వ్యవసాయ మార్కెట్‌కమిటీ చైర్మన్ బి.నర్సింలు యాదవ్, శామీర్‌పేట ఉమ్మడి మండల నాయకులు పలువురు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి స్వాగత అభినందనలు తెలియజేశారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని కలెక్టర్‌ను ఛాంబర్‌లో నూతన కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని చైర్మన్ బి.నర్సింలుయాదవ్‌తోపాటు మండలకాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తుంకి రమేశ్, మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గడ్డం రమేశ్, మేడ్చల్ ఎఎంసి డైరెక్టర్ తుంకి బిక్షపతి, ఎంసిపల్లి మండల మాజీ వైస్‌ఎంపిపి మంద శ్రీనివాస్‌రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు దోసకాలయ వెంకటేశ, నల్ల యాదగిరి, భానుచందర్ అర్జున్‌లు అందజేసి అభినందనలు తెలియజేశారు.

## బిటెక్ విద్యార్థి అదృశ్యం

**ఘట్‌కేసర్, జూన్ 16, ప్రభాతవార్త:**

బిటెక్ విద్యార్థి అదృశ్యమైన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఘట్‌కేసర్ మున్సిపల్ అంకుశాపూర్‌లోని ఎసిఈ ఇంజనీరింగ్ కళాశాలలో ఈసిఈ 3వ సంవత్సరం చదువుతున్న ఇస్లావత్ రాహుల్ (21) ఈనెల 14వ తేదీనుంచి కనిపించకుండా పోయాడు. ఘట్‌కేసర్ పట్టణంలోని వివేకానంద జూనియర్ కళాశాల దగ్గర గదిలో అద్దెకు ఉంటున్న రాహుల్ శనివారం మధ్యాహ్నం 12 గంటలకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో అంతటా వెతికినా అతని ఆచూకీ లభించకపోవడంతో రాహుల్‌తండ్రి ఇస్లావత్ మల్లేశ్ ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఘట్‌కేసర్ ఎస్ఐ సాయికుమార్ తెలిపారు.

## లంగర్ హౌస్‌లో ఒకే దేశం ఒకే ఎన్నిక పై అవగాహన




కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి నేతలు.

**మెహదీపట్నం, జూన్ 16, ప్రభాతవార్త :** కార్వాన్ నియోజకవర్గం లంగర్ హౌస్ డివిజన్ లో ఒకే దేశం ఒకే ఎన్నిక పై స్థానిక మహిళ మోర్చా అధ్యక్షురాలు సరళ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి హైదరాబాద్ పార్లమెంట్ కన్వీనర్ అల్వాల ఇంద్రసేనారెడ్డి, సీనియర్ నాయకులు ఉదయ్ కుమార్‌లు హాజరై మాట్లాడారు.. దేశంలో ఒకే ఎన్నిక జరగడం వలన ఎన్నికల ఖర్చు తగ్గుతుందన్నారు. పార్లమెంటుకు రాష్ట్ర అసెంబ్లీలకు దేశంలో వేరు వేరు ఎన్నికలు జరుగుతుండడంతో అభివృద్ధికి ఆటంకాలు ఏర్పడుతున్నాయని వివరించారు. దేశంలో ఒకేసారి ఎన్నికలు జరగడంతో ఇలాంటి ఇబ్బందులు తలెత్తవన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు డి శ్రీకాంత్ రావు, నాయకులు గోవర్ధన్, శ్రీను, సంతోష్, ఏకలవ్య సంఘం అధ్యక్షులు నర్సింగ్ రావు, ఎల్లయ్య, ధర్మయ్య స్థానికులు పాల్గొన్నారు.

## న్యూ క్లబ్ కమిటీ సభ్యులకు సత్కారం

**కంటోన్మెంట్, జూన్ 16 ప్రభాతవార్త:**

వెస్ట్ మరేడుపల్లి డివిజన్ కంటోన్మెంట్ నియోజకవర్గం లోని న్యూ క్లబ్ గోల్డెన్ జూబ్లీ జనరల్ బాడీ మీటింగ్ జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ నోముల ప్రకాష్, వైస్ ప్రెసిడెంట్ మహేందర్ రెడ్డి, కమిటీ సభ్యులను చొల్లేటి రమేష్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సత్కరించారు.

## మంత్రి శ్రీహరికి రాష్ట్ర సగర సంఘం ఘన సత్కారం



మంత్రి శ్రీహరిని సత్కరిస్తున్న రాష్ట్ర సగర సంఘం సభ్యులు

**సైబరాబాద్ ప్రతినిధి, జూన్ 16 ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమ, క్రీడలు, మత్స్యకార, యువజన సర్వీసుల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి సోమవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర ఆధ్వర్యంలో తెలంగాణ సగర సంఘం సభ్యులు మంత్రి వాకిటి శ్రీహరిని కలిసి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర మాట్లాడుతూ బీసీల పక్షపాతిగా ఉన్న ముదిరాజు బిడ్డ డాక్టర్ వాకిటి శ్రీహరికి క్యాబినెట్‌లో స్థానం కల్పించినందుకు కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వానికి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజులలో మెజారిటీగా ఉన్న బీసీల కోసం మరో ముగ్గురికి మంత్రివర్గంలో చోటు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గౌరక్క సత్యం సగర, ఉపాధ్యక్షులు మోడల ఆంజనేయులు సగర, కార్యనిర్వాహక కార్యదర్శి బంగారి ఆంజనేయులు సగర, నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం నర్వ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీసం చెన్నయ్య సగరలు మంత్రిని తన ఛాంబర్‌లో ఘనంగా సత్కరించారు.

## ఆటో మీటర్ చార్జీలను పెంచాలి

**ఆటోలకు పర్మిట్లు జారీ చేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు**



అభివాదం చేస్తున్న జెఎసి నాయకులు

**సైఫాబాద్, జూన్ 16 ప్రభాతవార్త:** దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఆటో మీటర్ చార్జీలు తక్షణమే పెంచాలని తెలంగాణ ఆటోరిక్షా డ్రైవర్స్ సంఘాల జెఎసి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జెఎసి కన్వీనర్ బి.వెంకటేశం, ప్రతినిధులు వి.మారయ్య, పి.శ్రీకాంత్ తదితరులు మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో కొత్త ఆటోరిక్షా పర్మిట్లు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం జివో జారి చేసిందుకు, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు ప్రభుత్వ ప్రతిపాదనను ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు జెఎసి పక్షాన సిఎం రేవంత్‌రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కొత్తగా ఆటోరిక్షా పర్మిట్లుకు, రవాణా రంగ సంక్షేమ బోర్డుకు గత రెండు దశాబ్దాలుగా ఆనేక రూపాల్లో పోరాటాలు నిర్వహిస్తున్నామని, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ప్రొఫెసర్ ఎం. కోదండరామ్ ప్రభుత్వంపై వత్తిడి తెచ్చి మంత్రి పొన్నం ప్రభాకర్‌తో చర్చలు జరపడంతో కొత్తగా 60 వేల ఆటోరిక్షాలకు పర్మిట్లు ఇవ్వడానికి జివొ జారీ చేయడానికి కృషి చేశారని వారు తెలిపారు. ఆటోడ్రైవర్లకు ఏడాదికి 12 వేల ఆర్థిక సహాయం అందించాలని, ఉచిత బస్ ప్రయాణం వల్ల అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకున్న డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

## మొక్కలు నాటిన బిజెపి నేతలు



**అత్తాపూర్ జూన్ 16,ప్రభాతవార్త :**

బిజెపి రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు సందీప్ ముదిరాజ్ ఆధ్వర్యంలో తల్లి వందనం కార్యక్రమంలో భాగంగా అత్తాపూర్ ఎర్రబోడ గవర్నమెంట్ స్కూల్ మరియు సంజీవ హిల్స్ దగ్గర బిజెపి నేతలు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.... ప్రధాని నరేంద్రమోడీ 11ఏళ్ల పాలనలో దేశంలో ఎంతో అభివృద్ధి చెందిదని మోడీతోనే దేశ అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. పేదలకు కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జిల్లా ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్, బొక్క బాల్రెడ్డి ,కోరనిసదానంద్, సత్యనారాయణ ముదిరాజ్,హరి కిషన్ జి,సోల్కర్ రెడ్డి,వనిత రెడ్డి,శ్రీకాంత్ రెడ్డి, మల్లేష్ చారి,వెంకటేష్, శ్రీనివాస్ రెడ్డి,సిద్దేశ్వర్, సురేందర్, వేణు, స్వప్న రెడ్డి,యాదయ్య,విజయ్ యాదవ్ ,రాజశేఖర్ రెడ్డి,పవన్,హరి మరియు నాయకులు పాల్గొన్నారు.

## హామీ ప్రకారమే స్థానిక సంస్థల ఎన్నికల ప్రకటించాలి : ఎర్ర సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎర్ర సత్యనారాయణ

**సైఫాబాద్, జూన్ 15 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించిన తరువాతే ఎన్నికలను ప్రకటించాలని లేని పక్షంలో కెసిఆర్ ప్రభుత్వానికి పట్టిన గతే ప్రభుత్వానికి ఈ పడుతుందని తెలంగాణ బిసి సంక్షేమ సంఘం హెచ్చరించింది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడిచిందని, స్థానిక సంస్థల ప్రతినిధుల కాలపరమితి గడిచి ఏడాది అయ్యిందని, న్యాయ ప్రతిబంధన లేకుండా తాను తెచ్చిన కులగణన తీర్పు వచ్చి ఆరు నెలలు గడిచినా ప్రభుత్వం ఇంతవరు 42 శాతం రిజర్వేషన్‌ల అంశంపై ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేక పోయిందని ఆయన విమర్శించారు. ఇందుకు నిరసనగా ఈ నెల 18న బుధవారం మహాదీక్ష చేపడుతున్నామని సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ హెచ్చరించారు. కేవలం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కారణంగానే ఈ జాప్యం జరిగిందని ఆరోపించారు. కులగణన ప్రభుత్వ అసెంబ్లీ తీర్మానాలు, బిసి కమిషన్ సానుకూల నివేదికల అనంతరం కూడా కేంద్ర ప్రభుత్వం చొరవ చూపక పోవడం దారుణమన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధికంగా బిసిల ఓట్లు పొంది వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి అధికారం అనే లక్ష్యంతో ముందుకు పోతున్న బిజెపి ఈ రాష్ట్రం పంపిన 42 శాతం బిసి రిజర్వేషన్‌ల అంశంలో రాజ్యాంగ రక్షణ చర్యలు చేపట్టకపోతే అధికారం కాదు కదా గత 45 సంవత్సరాల సగటు కంటే తక్కువ ఓట్లు కూడా రాకుండా పోతాయని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కేంద్రాన్ని ఒప్పించడానికి అవసరమైన యుద్ధ కార్యాచరణ చేపట్టాలని ఆయన సూచించారు. లేని పక్షంలో ఢిల్లీలో కాంగ్రెస్, బిజెపి జాతీయ కార్యాలయాలను ముట్టడిస్తామని ఎర్ర సత్యనారాయణ హెచ్చరించారు. ఈ సమావేశంలో బిసి సంఘాల నాయకులు కోల జనార్ధన్, దాసు సురేష్, సుధాకర్, నాగుల శ్రీనివాస్‌యాదవ్, మీనగా గోపి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటికి సమానంగా నీరు అందేలా కృషి చేస్తాం

**- మాజీ డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి**



బండ్లగూడ కార్పోరేషన్‌లోని ఒకటోవార్డు ఇందిరా నగర్‌లో పర్యటిస్తున్న జల మండలి మేనేజర్, మాజీ డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డిలు.

**నార్సింగి, జూన్ 16 ప్రభాతవార్త :** ప్రతీ ఇంటికి సమానంగా నీరు సరఫరా అయ్యేలా అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారని బండ్లగూడ కార్పోరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం జల మండలి మేనేజర్‌తో కలిసి ఒకటోవార్డు ఇందిరమ్మ కాలనీలో నీటి సమస్య పరిష్కారం కోసం పర్యటించారు. అక్కడ స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యను అధ్యక్షులు ధన్నాడ లక్ష్మణ్ అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. ఇళ్లు పైకి, కిందికి ఉండడం వలన నీటి సరఫరా సవ్యంగా జరుగడం లేదని పేర్కొన్నాడు. స్థానికుల సమస్యలు తెలుసుకున్న తరువాత రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ వీలైనంత త్వరగా ఈ కాలనీలో జంక్షన్ బాక్స్‌ను ఏర్పాటు చేయించి అన్ని ఇళ్లకు సమానంగా నీరు సరఫరా అయ్యేలా చేస్తామన్నారు. ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ ఆదేశాల మేరకు ప్రజల సమస్యలు తెలుసుకుంటూ, సంబంధిత అధికారులకు తెలిపి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. ప్రజలు ఏ సమస్య ఉన్నా నా దృష్టికి తీసుకు రావాలని, నేను కార్పోరేషన్ కమీషనర్ దృష్టికి, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లి వేగంగా పరిష్కరించేలా ప్రయత్నం చేస్తానన్నారు.

# సిఎం వస్తేనే ....చెత్త తొలగిస్తారా?

**-కొన్ని నెలలుగా రోడ్డుపైనే చెత్తకుప్పలు**
**-సిఎం పర్యటనతో తొలగింపు**
**-జిహెచ్ఎంసి అధికారుల పనితీరుపై సర్వత్రా విమర్శలు**



గత కొన్ని నెలలుగా రోడ్డుపై ఉన్న చెత్తకుప్పలు (ఫైల్‌ఫోటో)



సోమవారం సిఎం రేవంత్‌రెడ్డి పర్యటనతో చెత్తకుప్పలు తొలగిస్తున్న దృశ్యం

**అత్తాపూర్ జూన్16,ప్రభాతవార్త :**

కొన్ని నెలలుగా రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుండి ఆరంఘర్ వెళ్లే ప్రధాన రోడ్డు మార్గంలో చెత్త కుప్పలు దర్శనం ఇస్తున్నా...దుర్వాసన వెదజల్లుతున్నా పట్టించుకోవాల్సి అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారు. సోమవారం వ్యవసాయ యూనివర్సిటీలో రైతు భరోసా నిధుల మంజూరు కార్యక్రమానికి సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు హాజరుకావడంతో హడావిడిగా జిహెచ్ఎంసి అధికారులు రోడ్డుపై ఉన్న చెత్త కుప్పలను జెసిబి సహాయంతో తొలగించారు. నెలల కొద్ది రోడ్డుపై చెత్త కుప్పలు ఉన్నా పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా అటువైపు కన్నెత్తి చూడని అధికారులు ఇప్పుడు తొలగించడంతో పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇది చూసిన స్థానికులు సిఎం వస్తేనే చెత్త తొలగిస్తారా...వ్యర్థాలతో దుర్వాసన వెదజల్లుతున్నా ప్రజల ప్రాణాలు పట్టవ అంటూ అధికారులపై పలువురు ఆరోపణలు గుప్పిస్తున్నారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి నగరానికి వచ్చే ప్రధానం మార్గం అయినప్పటికి కొందరు వ్యక్తులు యథేచ్ఛగా ఆటోలలో వ్యర్థాలను తీసుకువచ్చి దర్జాగా వేసి వెళ్తున్న సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడమే కాకుండా జరిమానాలు విధించడం కూడా మరిచారు. ఇప్పటికైనా అధికారులు రోడ్డు మార్గంపై దృష్టి సారిస్తారో లేదో చూడాలి.

## విజయం అనేది స్పష్టత, క్రమశిక్షణ మార్గదర్శకత్వం నుండి వస్తుంది : పుల్లెల గోపీచంద్




కార్యక్రమంలో పాల్గొన్న భారత బ్యాడ్మింటన్ జట్టు ప్రధాన జాతీయ కోచ్ పుల్లెల గోపీచంద్, విశ్రాంత ఐఎఎస్ అధికారి అజయ్‌మిశ్రా

**చిక్కడపల్లి, జూన్ 16 ప్రభాతవార్త:** క్రీడలు, పౌర సేవలు ఏ రంగంలో అయినా విజయం అనేది స్పష్టత, క్రమశిక్షణ మార్గదర్శకత్వం నుండి వస్తుందని పద్మభూషణ్ అవార్డు గ్రహీత, భారత బ్యాడ్మింటన్ జట్టు ప్రధాన జాతీయ కోచ్ పుల్లెల గోపీచంద్ అన్నారు. సోమవారం అశోక్‌నగర్‌లో ఏఆర్ కె రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ నూతన కేంద్ర ప్రారంభోత్సవ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన గోపిచంద్ మాట్లాడుతూ ఏఆర్ కె రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ అకాడమి ఉన్నత విలువలను ప్రతిబింబించే వేదికను నిర్మిస్తోందని, . లక్ష్యం, సమగ్రతతో దేశానికి సేవ చేయడానికి యువతను శక్తివంతం చేస్తుందన్నారు. ఏఆర్ కె గ్రూప్ సిఎండి జి. రామ్ రెడ్డి సంస్థ లక్ష్యంపై తన సంతోషం, నమ్మకాన్ని వ్యక్తం చేశారు. "ఏఆర్ కె వద్ద ప్రభావాన్ని సృష్టించే సంస్థలను నిర్మించడాన్ని తాము విశ్వసిస్తున్నామని, నూతన కేంద్రం ద్వారా మౌలిక సదుపాయాలను మాత్రమే విస్తరించటమే కాకుండా ప్రతి ఆశావాహునికి అందుబాటులో ఉంటూనే అవకాశం ఉద్దేశ్యాన్ని విస్తరిస్తున్నామన్నారు. విశ్రాంత సీనియర్ ఐఏఎస్ అధికారి అజయ్‌మిశ్రా మాట్లాడుతూ ఈ కేంద్రం పోటీపరీక్షలకు సన్నద్ధమవుతున్న వారి భవిష్యత్తు పునాదిగా నిలస్తుందన్నారు. డైరెక్టర్ డాక్టర్ వివేకానంద మాట్లాడుతూ ఈ కొత్త కేంద్రం వ్యక్తిగతీకరించిన మార్గదర్శకత్వం, సమగ్ర శిక్షణ పట్ల మా నిబద్ధతకు సహజమైన కొనసాగింపు అని అన్నారు.

## బిఎంఎస్ నేషనల్ జనరల్ సెక్రటరీగా కృష్ణ



నూతనంగా ఎన్నికైన జాతీయ కార్యవర్గం

**హైదరాబాద్, జూన్ 16, ప్రభాతవార్త:**

భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) నేషనల్ జనరల్ సెక్రటరీగా టి.కృష్ణ మరోసారి ఎన్నికయ్యారు. చత్తీస్‌గడ్‌లో ఈ నెల 14,15 తేదీల్లో జరిగిన చత్తీస్ గడ్ అటానమస్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ త్రై వార్షిక సమావేశాల్లో బీఎంఎస్ నిర్ణయం తీసుకుంది. మూడేళ్ల క్రితం గుజరాత్ బావూనగర్ లో జరిగిన భారతీయ మజ్దూర్ సంఘ్ జాతీయ కార్యవర్గ సమావేశంలో జాతీయ జనరల్ సెక్రటరీగా నియమితులైన టి.కృష్ణ ను మరో మూడేళ్ల పాటు నేషనల్ జనరల్ సెక్రటరీగా కొనసాగిస్తూ బీఎంఎస్ నియామక ప్రతాన్ని అందజేసింది. ఇప్పటికే ఆయన భారతీయ మజ్దూర్ సంఘ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడితో పాటు భాగ్యనగర్ మున్సిపల్ జీహెచ్ఎంసీ ఎంప్లాయీస్ యూనియన్ జనరల్ సెక్రటరీగా కూడా వ్యవహరిస్తున్నారు. నేషనల్ జనరల్ సెక్రటరీగా నియమితులైన కృష్ణ మాట్లాడుతూ మరోసారి తనను నేషనల్ జనరల్ సెక్రటరీగా నియమించిన బీఎంఎస్ కార్యవర్గానికి ధన్యవాదాలు తెలియజేశారు. హైదరాబాద్ జిల్లాలో బీఎంఎస్ బలోపేతానికి కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. త్వరలో జరగనున్న జీహెచ్ఎంసీ యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో బీఎంఎస్ గెలుపునకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఇప్పటికే జీహెచ్ఎంసీ ఉద్యోగ, కార్మికుల సమస్యల కోసం రాజీలేని పోరాటం చేస్తున్న తమ యూనియన్ కు రోజురో జుకి జీహెచ్ఎంసీలో ఆదరణ పెరుగుతుందన్నారు. మరో మూడేళ్ల తర్వాత మళ్లీ బీఎంఎస్ జాతీయ కార్యవర్గం సమావేశం నిర్వహించి, జాతీయ కార్యవర్గంలో మార్పులు చేయనున్నట్లు కృష్ణ తెలిపారు.

## మంత్రి వాకిటి శ్రీహరిని సత్కరించిన రవిశేఖర్‌రెడ్డి



మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వాకిటి శ్రీహరిని అభినందిస్తున్న రాష్ట్ర యువజన కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ రవిశేఖర్‌రెడ్డి తదితరులు

**హైదరాబాద్ జూన్ 16, ప్రభాతవార్త :**

రాష్ట్ర పశుసంవర్ధక శాఖ, క్రీడా యువజన శాఖ మంత్రిగా అధికారికంగా పదవి బాధ్యతలు స్వీకరించిన వాకిటి శ్రీహరిని కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం నేషనల్ సెక్రటరీ ,రాష్ట్ర యువజన కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ పి.వి.రవిశేఖర్ రెడ్డి ఘనంగా సత్కరించారు. సోమవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో బాధ్యతలు చేపట్టిన మంత్రిని తిరుపతి వెంకన్న స్వామి శాలువాతో సత్కరించి,తీర్థ ప్రసాదాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమములో కాంగ్రెస్ నాయకులు ఎం.నరేందర్ రెడ్డి, కె.వి.రమణ,సంపత్‌కుమార్, మురళి ముదిరాజ్, నాగరాజు,భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ఎంపీ వైద్యుడి నిర్లక్ష్యం కారణంగా జిమ్‌కోచ్ మృతి

**ఆస్పత్రి ముందు బంధువుల ఆందోళన**

**కంటోన్మెంట్, జూన్ 16 ప్రభాతవార్త:**

సికింద్రాబాద్ రీసాలబజార్‌లో ఆర్ఎంపీ వైద్యుడి నిర్లక్ష్యం కారణంగాఓ జిమ్ కోచ్ మృతిచెందిన సంఘటన స్థానికంగా సంచలనంగా మారింది. వివరాల్లోకి వెళ్తే జిమ్ కోచ్ జ్ఞానేశ్వర (24) ఆదివారం రాత్రి ఫ్రెండ్స్ తో కలిసి బిర్యాని తిన్నాడని, ఇంటి వద్దకు వచ్చిన అనంతరం ఛాతీలో నొప్పి రావడంతో స్థానిక ఆర్ఎంపి వైద్యుడు వంశీ క్లినిక్ వద్దకు వెళ్లాడు. మృతుడిని పరిశీలించిన ఆర్ఎంపి వైద్యుడు జిమ్ కోచ్‌తో గ్యాస్ట్రిక్ సమస్య అని ఒక ఇంజక్షన్ ఇచ్చి పంపించాడు. మృతుడు క్లినిక్ నుంచి ఇంటికి వెళ్లిన కొద్ది సేపటికే ఇంటి వద్ద కుప్పకూలిపోయాడని, వెంటనే అతన్ని స్థానిక కంటోన్మెంట్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా పరీక్షించిన వైద్యులు అతనికి సరైన ఆక్సిజన్ అందకపోవడం వల్లనే మృతి చెందినట్లు ధృవీకరించారు. దీంతో కోపోద్రిక్తులైన మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు క్లినిక్ వద్దకు చేరుకొని పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. ఆర్ఎంపి వైద్యునికి అనుభవం లేకపోవడం నిర్లక్ష్యం వహిస్తు ఇంజక్షన్ చేయడం వల్లనే జ్ఞానేశ్వర్ మృతి చెందాడని బంధువులు ఆరోపించారు. ఆర్ఎంపి వైద్యుడిపై హత్య కేసు నమోదు చేయాలని బంధువులు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న బొల్లారం పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లివిషయం తెలుసుకున్న బొల్లారం పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి బంధువులు, కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆర్ఎంపి వైద్యుడిని బొల్లారంలో అదుపులోకి తీసుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఆర్ఎంపి వైద్యునిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రాష్ట్రంలో అనేక సందర్భాలలో ఆర్ఎంపి వైద్యుల నిర్లక్షయం వల్ల సామాన్యులు చెందుతున్నారని, ప్రభుత్వం, సంబంధిత మృతి వైద్య అధికారులు కఠిన చర్యలు తీసుకుంటున్నప్పటికీ అక్కడక్కడ ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని, ప్రభుత్వం వైద్య ఉన్నతాధికారులు ఇలాంటి ఆర్ఎంపి వైద్యుల పట్ల కఠిన చర్యలు తీసుకొని మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పకడ్బంది చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## మహిళను వివాహం చేసుకుంటానంటూ లక్షల్లో నగదు వసూలు

**-బాధితురాలి ఫిర్యాదు..కేసు నమోదు**

**బేగంపేట జూన్ 16.ప్రభాతవార్త**

మహిళను వివాహం చేసుకుంటానంటూ షాదీ డాట్ కామ్ లో పరిచయమైన ఓ వ్యక్తి మహిళను పెళ్లి చేసుకుంటానంటూ నమ్మించాడు. లక్షల్లో నగదు వసూలు చేసాడు. ఆమెపై పలు మార్లు బలవంతంగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం ముఖం చాటేసాడు. అయితే బాధితురాలి ఫిర్యాదుతో అతని పై కేసు నమోదైంది. ఈ సంఘటన బేగంపేట పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలి లా ఉన్నాయి. బేగంపేట రసూల్‌పురా కు చెందిన మహిళ (47) కు వెస్ట్ ముంబాయికి చెందిన కల్పేష్ కక్కడ్ (42) షాదీ డాట్ కామ్ లో పరిచయమయ్యాడు. నిన్ను వివాహం చేసుకుంటానంటూ ఆమెకు ఫేస్ బుక్ రిక్వెస్ట్ పంపించి పరిచయం మరింత పెంచుకున్నాడు. 2023 జనవరి లో నగరానికి చేరుకున్న కల్పేష్ శశికాంత్ కక్కడ్ బేగంపేట లోని తాజ్ వివాంతా హోటల్ లో బస చేసాడు. పలు మార్లు బాధితురాలిని అక్కడికి రప్పించి ఆమెతో మాట్లాడాడు. తనకు చాలా ఆస్తులున్నాయని ఆమెను నమ్మించాడు. పెళ్లి చేసుకుంటానంటూ నమ్మ బలికాడు. పలుమార్లు బలవంతంగా అత్యాచారం చేసాడు. షేర్ మార్కెట్ లో పెట్టు బడులు అంటూ బాధితురాలితో పాటు ఆమె బంధువుల నుంచి రూ 22లక్షల వరకు డబ్బును అప్పుగా తీసుకున్నాడు. మరోసారి పెట్టుబడులంటూ బాధితురాలి ని నమ్మించి మరో రూ 2లక్షలు తీసుకున్నాడు. ఆ తర్వాత మెల్లగా ముంబాయికి పారిపోయాడు. బాధితురాలు ఫోన్ చేసి పెళ్లి విషయం, డబ్బు విషయం ప్రస్తావిస్తే వారిద్దరూ సన్నిహిత సమయంలో తీసుకున్న ఫోటోలు, వీడియోలు తన వద్ద ఉన్నాయని, మరికొంత డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వీడియోలు, ఫోటోలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తానంటూ బెదిరించాడన్నారు. తాను మోసపోయినట్లు గ్రహించిన బాధితురాలి చేసేదేమిలేక శనివారం బేగంపేట పోలీసులకు పిర్యాదు చేసింది. ఈ మేరకు ఇన్స్‌పెక్టర్ బి.ప్రసాదరావు అత్యాచారం, మోసం కింద నిందితుడిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి : కార్పోరేటర్




జీహెచ్ఎంసీ అధికారులతో బేగంపేట కార్పోరేటర్ టి.మహేశ్వరి శ్రీహరి.

**బేగంపేట జూన్ 16,ప్రభాతవార్త**

వర్షాకాలం నేపథ్యంలో నీరు నిలిచి ఉండే ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని బేగంపేట కార్పోరేటర్ టి.మహేశ్వరి శ్రీహరి అధికారులకు సూచించారు .సోమవారం బేగంపేట డివిజన్ పరిధిలో జీహెచ్ఎంసీ బేగంపేట సర్కిల్ డీసీ డాకు నాయక్ సిబ్బందితో కల్సి ఆమె నీరు నిల్చి ఉండే ప్రాంతాలలో చేపట్టాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలపై అధికారులతో చర్చించారు. మూడు రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాన్ని కార్పోరేటర్ మహేశ్వరి శ్రీహరి,డీసీ డాకు నాయక్‌తో కల్సి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో ఇబ్బందులను పరిష్కరించడంతో పాటు ఎప్పటి కప్పుడు చెత్త తరలింపు,నాలాల పూడిక తీత,పారిశుధ్య సమస్యల పరిష్కారం, ఫాగింగ్ ,విద్యుత్ సమస్యల వంటి పనులను మూడు రోజుల పాటు యుద్ధ ప్రాతిపదికన కొనసాగించనున్నట్లు తెలియజేసారు. వర్షాకాలంలో ఎదురయ్యే ఎలాంటి సమస్యలనైనా ప్రజలు నేరుగా తన దృష్టికి తీసుకు రావాలని వివిధ శాఖల అధికారులు కోరారు. కార్యక్రమంలో డీఈ వెంకటేశ్వరరావు,వివిధ శాఖల అధికారులతో పాటు స్థానిక బీఆర్ఎస్ నాయకులు శ్రీహరి,నరేష్,పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

## శెట్టి బలిజ కులాన్ని బీసీ జాబితాలో చేర్చాలి



డా.చిన్నారెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న శెట్టి బలిజ కులస్థులు.

**బేగంపేట జూన్ 16,ప్రభాతవార్త**

శెట్టి బలిజ కులాన్ని బీసీ జాబితాలో చేర్చాలని కోరుతూ ఆ సంఘం ప్రతినిధులు రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.జి.చిన్నారెడ్డిని సోమవారం ప్రజాభవన్‌లో కల్సి వినతి పత్రాన్ని అందించారు. ఉమ్మడి రాష్ట్రంలో బీసీ జాబితాలో శెట్టి బలిజ కులం ఉందని,తెలంగాణా రాష్ట్రం ఏర్పాటైన తరువాత బీసీ జాబితా నుంచి తొలగించారని వారు పేర్కొన్నారు. టైపు మిస్టేక్ వల్ల పొరపాటు జరిగిందని,తెలంగాణా బీసీ కమీషన్ అభిప్రాయ పడి దీన్ని సరిదిద్దాలని బీసీ శాఖ కార్యదర్శికి కమీషన్ మెంబర్ సెక్రటరీ లేఖ రాశారని ఆ సంఘం ప్రతినిధులు శ్రీనివాస్,గణపతి,ప్రసాద్,తెలియజేసారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసికెళతానని చిన్నారెడ్డి వారికి తెలియజేసారు.

### హౌజింగ్ బోర్డు పై ఆగ్రహం వ్యక్తం చేసిన హై కోర్టు

**సంజీవరెడ్డి నగర్,జూన్ 16 ప్రభాతవార్త:**

ఎస్.అర్.నగర్ కమ్యూనిటీ హాల్ అమ్మవద్దని హై కోర్టులో ప్రవైట్ ఫిటిషన్ వేసిన ప్రముఖ న్యాయవాధి గుంపుల శ్రీకాంత్ యాదవ్ ఎస్. ఆర్.నగర్ కమ్యూనిటీ హాల్ అమ్మవద్దని ఎస్. ఆర్.నగర్ రెసిడెన్స్‌వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజేశ్ తరుపున అడ్వకేట్ గుంపుల శ్రీకాంత్ యాదవ్ సోమవారం సుదీర్ఘమైన వాదనలు జస్టిస్ లక్ష్మణ్ బేంచ్‌నందు హై కోర్టులో వాదోపవాదాలు చేశారు. అడ్వకేట్ శ్రీకాంత్ వాదోపవాదాలు జడ్జీవెంటనే ఎస్. ఆర్.నగర్ కమ్యూనిటీ హాల్ అమ్మకానికి పెట్టిన టెండర్ పూర్తి వివరాలను 24వ తేదీన హై కోర్టులో సమర్పించాలని హౌజింగ్ బోర్డు వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

### దూద్‌బౌలి నుంచి సికింద్రాబాద్, వనస్థలిపురంకు బస్సులు నడిపించాలి

**చార్మినార్,జూన్ 16 ప్రభాతవార్త :** పాతబస్తీ దూద్‌బౌలి నుంచి నగరంలోని సికంద్రాబాద్ వనస్థలిపురం,కోఠితో పాటు పలు ప్రాంతాలకు ఆర్‌టిసి బస్సులను నడపాలని కోరుతూ బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్ సోమవారం ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజశేఖర్‌నుకలిసి వినతి పత్రం అందజేశారు. కరోనా కంటే ముందు సమయంలో దూద్‌బౌలి నుంచి కోఠి,వనస్థలి పురం, సికింద్రాబాద్ ప్రాంతాలకు 73,72వి,8డి బస్సులు నడుస్తుం దేవని, కరోనా తర్వాత ఒక్క బస్సు కూడ తిరగటం లేదని, దాదాపు రెండు కిలోమీటర్లు ప్రజలు నడిచి బస్సులు ఎక్కుతున్నారని రాజేష్ కుమార్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజశేఖర్‌కు అందజేసిన వినతి పత్రంలో పేర్కొన్నారు.

## ఏకగ్రీవంగా ఎంపికైన సీనియర్ సిటిజెన్స్ నూతన కార్యవర్గం




బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్‌లోని సీనియర్ సిటిజెన్స్ నూతన కార్యవర్గ సభ్యుల దృశ్యం

**నార్సింగి, జూన్ 16 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలో ఉన్న సీనియర్ సిటిజెన్స్ సంక్షేమ సంఘం సర్వ సభ్య సమావేశం ధాత్రి కాలనీలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా వారంతా కలిసి నూతన కార్యవర్గంను ఏకగ్రీవంగా ఎంపిక చేసుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుఉలగా శివరామిరెడ్డి, సహ అధ్యఓఉలుగా ఆనందరెడ్డి, ఉపాధ్యక్షుఉలగా రామలింగం, మహేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా కామేశ్వర్‌రావ్, సహ కార్యదర్శిగా మల్లయ్య, కోశాధికారిగా బెంజమెన్, సాంస్కృతిక కార్యదర్శిలుగా నరసిహ్మా, నారాయణాచార్యులు, ప్రతాప్‌రావ్, ప్రజా సంబంధాల కార్యదర్శిగా శంకర్, సభ్యులుగా గోవర్ధన్‌సింగ్, కృష్ణమూర్తి, జగన్నాథస్వామి, విజయ్ కుమార్, చంద్రశేఖర్‌లు నియమితులయ్యారు. ఈ సందర్భంగాన అధ్యక్షులు శివరామిరెడ్డి మాట్లాడుతూ సభ్యులందరి సలహాలు, సూచనలు, సహకారంతో మంచి నిర్ణయాలు తీసుకొని ముందుకెల్తామని స్పష్టం చేశారు.

## లగ్జరీ క్లబ్‌హౌస్‌ను ప్రారంభించిన పుల్లెల గోపీచంద్



కోకాపేట్‌లో లగ్జరీ క్లబ్‌హౌస్ క్లబ్ ఒడిస్సి ప్రారంభోత్సవంలో పాల్గొన్న జాతీయ బ్యాడ్మింటిన్ కోచ్ పుల్లెల గోపీచంద్.

**నార్సింగి, జూన్ 15 ప్రభాతవార్త :** కోకాపేట్‌లోని రాజపుష్ప ప్రావిన్షియాలోని లగ్జరీ క్లబ్‌హౌస్‌ను సోమవారం పద్మభూషణ్, జాతీయ బాడ్మింటిన్ కోచ్ పుల్లెల గోపీచంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినియోగదారుల విశ్వాసాన్ని ఏటేటా పెంచుకోవడంలో రాజపుష్ప అగ్రభాగాన నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రజల అభిరుచుల మేరకు, అత్యాధునికమైన వసతులతో కూడిన లగ్జరీ ఇళ్ల నిర్మాణం చేస్తూ రియల్ ఎస్టేట్ రంగంలో రారాజుగా రాజపుష్ప కొనసాగుతుందన్నారు. అనంతరం రాజపుష్ప ప్రాపర్టీస్ ఇడి పి.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఔటర్ రింగ్‌రోడ్డుకు నిమిషాల వ్యవధిలో చేరుకునేలా రాజపుష్ప ప్రావిన్షియా 23.75.ఎకరాల విస్తీర్ణంలో 3,498 ప్రీమియం అపార్టుమెంట్లతో నిర్మించామని, ఇందులో 1908 యూనిట్లు అమ్ముడయ్యాయని తెలిపారు. అతిపెద్ద స్విమ్మింగ్ ఫూల్, జిమ్, ఇండోర్ క్రీడా మైదానాలు, రెస్టారెంట్లు, కేఫ్‌లు, లాంజ్‌లు, స్పా, వెల్‌నెస్ సెంటర్, బాస్కెట్‌బాల్ కోర్టు, పిల్లలు, పెద్దల కోసం వినోద కేంద్రాలు, మెడిటేషన్, యోగ, ఏరోబిక్స్ వంటి వసతులు ఏర్పాటు చేశామని వివరించారు. అన్ని రకాల వసతులు ఒకే ప్రాంతంలో కల్పిస్తూ, ఆనందమైన జీవితంను గడిపేందుకు రాజపుష్పలో పెద్దపీట వేస్తున్నామన్నారు.

## బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కళాశాలలో వర్క్‌షాప్



కార్యక్రమంలో పాల్గొన్న ఉస్మానియా విశ్వవిద్యాలయం అధ్యాపక బృందం, చిత్రంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విద్యాసంస్థల సీఈవో లింబాద్రి తదితరులు

**చిక్కడపల్లి, జూన్ 16 ప్రభాతవార్త:** బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ స్వయంప్రతిపత్తి విద్యాసంస్థలో ఐదు రోజుల పాటు ఎఫ్‌డిపి వర్క్‌షాప్ ముగిసింది. ఫిజికల్ సైన్స్ విభాగం నుంచి వేమన్ రెడ్డి ఆర్గనైజర్ అశోక్ నిత్య ఏంజెల్ నిర్వహణలో ముగిసాయి. వివిధ అంశాలపై ఓయు ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ విభాగం పూర్వ డైరెక్టర్ విశ్రాంత ప్రొఫెసర్ లక్ష్మీపతిరావు, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ విభాగం కోఆర్డినేటర్ బి. నిరైమతి, వాణిజ్యశాస్త్ర విభాగాధిపతి ఎల్‌వి.కమల, సామాజిక శాస్త్రాల విభాగం విభాధిపతి డాక్టర్ సీమా ఘోష్, అదనపు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎంవిఎస్. మహేందర్ వివిధ అంశాలపై విశ్లేషించి ప్రసంగించారు.. కార్యక్రమంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విద్యాసంస్థల సీఈవో లింబాద్రి, డైరెక్టర్ విష్ణుప్రియ, ప్రొఫెసర్ యాదగిరి, డాక్టర్ మట్ట శంకర్ ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ పాల్గొని విజయవంతం చేశారు.

## ప్రధాని మోడీ పాలన చరితాత్మకం : బిజెపి



అభివృద్ధికార్యక్రమాలపై కరపత్రం విడుదలచేస్తున్న బిజెపి నాయకులు

**ఘట్‌కేసర్‌రూరల్, జూన్16, ప్రభాతవార్త:** 11యేండ్ల ప్రధాని నరేంద్రమోడీ పాలనలో 500 సంవత్సరాల కల రామమందిరం నిర్మాణమైందని పార్టీ మున్సిపల్ ఇంఛార్జీ రాసాల నర్సింగ్‌రావు అన్నారు. పోచారం మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు సురేశ్ నాయక్ అధ్వర్యంలో మోడీ గారి 11యేండ్ల విజయవంతమైన పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు అనే అంశంపై సంకల్ప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పార్టీ మున్సిపల్ ఇంఛార్జీ మాట్లాడుతూ మోడీపాలన చారిత్మకమైందని అన్నారు. రామ మందిర నిర్మాణం, జమ్మూకాశ్మీర్ ఆర్టికల్ 370 రద్దు, వక్ఫ్‌బోర్డు సవరణలు, త్రిబుల్ తలాక్, ప్రపంచంలోనే ఆర్థికంగాపదవస్థానం నుండి 4వ స్థానానికి తీసుకురావడం, అసాధ్యాలను సుసాధ్యం చేసే దమ్మున్న నాయకుడు నరేంద్రమోడీఅన్నారు. గ్రామపంచాయతీలు, మున్సి పాల్టీలకు నిధుల కేటాయింపు, స్ట్రీట్ లైట్లు, ఎన్ఆర్‌జీఎస్ క్రింద రోడ్ల నిర్మాణం, రేషన్ సన్నబియ్యం, గ్రామాల్లో శ్మశాన వాటికల నిర్మాణం, డంపింగ్‌యార్డుల ఏర్పాటు, పల్లెప్రకృతి వనాలు, మహాత్మగాంధీ గ్రామీణ ఉపాధి హామీపథకం అమలు వంటి పలు అభివృద్ధి సంక్షేమ పథకాలు చేపట్టిన ఘనత ప్రధాని నరేంద్రమోడీకే దక్కుతుందని అన్నారు. ఈ సందర్భంగా 11 యేండ్ల మోడీ పాలన కరపత్రాన్ని పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో గిరిజన మోర్చా జాతీయ నాయకులు నానావత్ బిక్కునాయక్, మాజీ కౌన్సిలర్ గొంగళ్ల మహేశ్ కురుమ, నాయకులుబాలేశ్‌కురుమ, రాజారమేశ్, గుండె నరేశ్, కళ్యాణ నాయక్, శివనాయక్, వరికుప్పలయాదగిరి, గంజివంశీకుమార్ మీడియా కన్వీనర్‌అనిల్‌కుమార్, కవిత, విజయ, రాధ పాల్గొన్నారు.

### మున్సిపల్ బిజెపి నూతన కమిటీ ఎన్నిక

**మేడ్చల్, జూన్16, ప్రభాతవార్త :** మేడ్చల్ మున్సిపల్ బీజేపీ పూర్తిస్థాయి నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. మున్సిపల్ పార్టీ అధ్యక్షురాలు శైలజా హరినాథ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో మున్సిపల్ పార్టీ ఇంచార్జ్ రవీందర్ గౌడ్ కమిటీ సభ్యులను ప్రకటించారు. ఈ కమిటీ ఉపాధ్యక్షులుగా మైసరి రాజు, మల్లేష్ యాదవ్, సర్వేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా వంజరి వంశీ విజయ్, జాకట ప్రేమ్ దాస్, కార్యదర్శులుగా దాత్రిక లక్ష్మణ్, బండి విష్ణుగౌడ్ ,దొంతం బోయినసాయి, బొక్కసురేందర్‌రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, హన్మంత్‌రెడ్డి, కోషాధికారిగా తాళ్లపల్లి ఉపేందర్ గుప్త, కార్యవర్గ సభ్యులుగా వెంకటేష్ ముదిరాజ్, రాంచందర్‌రెడ్డి, నవీన్, ఎస్ వీ శ్రీనివాస్, జాకెట్ బాలకృష్ణ, బొక్క సురేందర్‌రెడ్డి, టైలర్ రాజు, శ్రీపాల్‌రెడ్డి, నర్సింగ్, దశరథ, శోభారెడ్డి, పద్మాక్షి, శ్రీమాన్, గౌతంలను ఎన్నుకున్నారు. కాగా నూతనంగా ఎన్నికైన సభ్యులను మున్సిపల్ అధ్యక్షురాలుతో పాటు మున్సిపల్ ఇంచార్జ్ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కమిటీ సభ్యులు భాధ్యతతో పని చేసి పార్టీ అభ్యున్నతికి కృషి చేయాలని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ అధ్యక్షుడు అంజనేయులు గౌడ్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, జగన్ గౌడ్, అర్జున్ వంశీరెడ్డి, ఈశ్వర్, హరిబాబురెడ్డి, హేమలతారెడ్డి, రాఘవరెడ్డి, అనిత, బాబు రాజు, మహేష్, రతన్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

### చాకలి ఐలమ్మ విగ్రహ ప్రతిష్ఠకు భూమి పూజ



భూమిపూజ చేస్తున్న మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి

**కేశంపేట జూన్ 16 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో సోమవారం వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహ ప్రతిష్ఠకు భూమి పూజ నిర్వహించిన కేశంపేట మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కేశంపేట మండల అధ్యక్షులు గూడ వీరేశం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు జగదీశ్వర్, వ్యవసాయ కమిటీ డైరెక్టర్ భాస్కర్ గౌడ్, యలగమోని గిరి యాదవ్, సురేష్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, రూప్ల నాయక్, కరుణాకర్‌రెడ్డి, శ్రీధర్, అలగొండసీనయ్య, నరసింహ, శ్రీను, వ మండల రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

### చిన్నారి చిట్టి చదువుకు ఉప్పల ట్రస్ట్ చేయూత



**తలకొండపల్లి జూన్15, ప్రభాతవార్త :** తలకొండపల్లి మండలం తాళ్లగుట్ట గ్రామపంచాయతీ పరిధిలోని నిరుపేద గిరిజన తండాకు చెందిన చిట్టి అనే విద్యార్థిని తమ తల్లిదండ్రులను కోల్పోయి అనాధగా మిగిలింది. దీంతో చలించి పోయిన మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ తన ట్రస్ట్ నుంచి ఆ విద్యార్థిని చదువుకయ్యె ఖర్చులు భరించేందుకు ముందుకు వచ్చారు. గత సంవత్సరం 2004 2005 విద్యా సంవత్సరంలో ఆరో తరగతి చదివేందుకు పూర్తి సహకారం అందించిన వెంకటేష్, ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఏడవ తరగతి చదివేందుకు కృతనిచ్చేయమైంది. దీంతో ఆదివారం నాడు హైదరాబాదులోని ఉప్పల ట్రస్ట్ చైర్మన్ వెంకటేష్ స్వగృహంలో వెంకటేష్ ను కలిసి తమ ఏడవ తరగతి చదువుకు ఆర్థిక సాయం చేయాలని కోరారు. అందుకు సమ్మతించిన ఉప్పల వెంకటేష్ ఈ సంవత్సరం చదివేందుకు పూర్తిగా తన ట్రస్ట్ నుంచి ఆర్థిక సాయం అందజేస్తానని స్కూల్ ఫీజు తో కూడిన మొత్తం డబ్బును తమ ట్రస్టు ద్వారా అందజేయనున్నట్లు ట్రస్ట్ నుంచి స్కూల్ ఫీజు హామీ పత్రాన్ని విద్యార్థినికి అందజేశారు. తండా వాసులు తదితరులు పాల్గొన్నారు.

### విస్మరిస్తే ఉద్యమిస్తాం టిఎస్ఎం హెచ్ పిఎస్

**బొంరాస్‌పేట్ జూన్ 16, ప్రభాతవార్త:** కేబినెట్ విస్తరణలో ముస్లిం సామాజిక ప్రజాప్రతి నిధులకు సరైన ప్రాతినిధ్య మివ్వక రాష్ట్ర ప్రభుత్వంవిస్మరించిందనిసరైనప్రాతినిధ్యం కల్పించకపోతే ఉద్యమి స్తామని టిఎస్ఎంహెచ్ పిఎస్ రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు వసీం ప్రభుత్వాన్ని హెచ్చరించాడు. సోమవారం ఆయన మండల కేంద్రంల నిజమమజీద్‌ఆవరణలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు .ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, కర్ణాటక రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడడానికితోడ్పాటునందించిన ముస్లిం సామాజిక వర్గం ప్రాతినిధ్యాన్ని గుర్తించి గౌరవించి కేబినెట్ లో ముగ్గురికి చోటు కల్పించిందని ఆయన గుర్తు చేశారు. నేడు యావత్ ముస్లిం సమాజం భాద పడేలా మనో భావాలు దెబ్బ తినేలా ఎరిని విస్మరించే విధంగా ప్రభుత్వం వ్యవరిస్తూ కేబినెట్లో ముస్లిం ప్రజా ప్రతినిధులకు చోటు కల్పించకపోవడం గర్హనీయమని ఆయన తీవ్రంగా విమర్శించాడు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం గుర్తెరిగి ముస్లిం సామాజిక వర్గ ప్రజాప్రతినిధులకు కేబినెట్లో చోటు కల్పించేలా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ లేనిచో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశం లో తెలంగాణ రాష్ట్ర మైనార్టీ హక్కుల పోరాట సమితి ముఖ్యనేతలుముస్తఫా, ఎఫ్ఎస్ సలాం, సాజీద్, ఇలియాజ్ పాల్గొన్నారు.

## భూభారతి కొత్త చట్టం ద్వారా రెవెన్యూ సమస్యలు పరిష్కారం

### కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**కడ్తాల్, జూన్ 16, ప్రభాత వార్త :** భూ సమస్యల పరిష్కారానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భూభారతి కొత్త చట్టం 2025 తీసుకువచ్చిందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం కడ్తాల్ మండల కేంద్రంలో రైతు వేదికలో భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరై మాట్లాడుతూ ఈ సదస్సులో తహసిల్దార్ స్థాయిలో పరిష్కరించే సమస్యలను దరఖాస్తు చేసుకుంటే అప్పటికప్పుడే పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ఆర్డిఓ స్థాయిలో కూడా పరిష్కరించేందుకు వీలుంటుందని తెలిపారు. ఈ భూభారతి రెవెన్యూ సదస్సులను రైతన్నలు సద్వినియోపరుచుకొని లబ్ధి పొందాలని ఆయన సూచించారు. గత ప్రభుత్వంలో ధరణి పోర్టల్ వల్ల రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ధరణి పోర్టల్ ను బంగాళాఖాతంలో పడేసి.. భూభారతి కొత్త రెవెన్యూ చట్టాన్ని తీసుకురావడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ఘనత అని ఆయన అన్నారు. కడ్తాల్ మండల తహసిల్దార్ షేక్ ముంతాజ్ బేగం, టిపిసిసి సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుదుర




భాస్కర్, బ్లాక్ కాంగ్రెస్‌అధ్యక్షుడుయాట నరసింహ, మార్కెట్ కమిటీ సభ్యులు నరేష్, చందోజీ , రైతులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

### రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



రెవెన్యూ సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే యాదయ్య

**నవాబుపేట జూన్ 16, ప్రభాతవార్త:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని చేవెళ్ళ ఎమ్మెల్యే కాలె యాదయ్య సూచించారు. సోమవారం మండల పరిధిలోని చిట్టిగిద్దలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. అదేవిధంగా మండల కేంద్రంలోని కస్తూర్బా ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకుపాఠ్యపుస్తకాలను పంపిణి చేశారు. ఈ సందర్భంగా చిట్టిగిద్దలో మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో అంధిన ప్రతి ధరఖాస్తును అధికారులు పరిశీలిస్తారని అన్నారు. స్థానికంగా పరిష్కారమైయ్యే సమస్యలను త్వరగతిన పరిష్కారం చేస్తారని అన్నారు. ఉన్నత అధికారుల ద్వారా పరిష్కారం అయ్యేసమస్యను కొంతవ్యవధిలో పరిష్కారం చేస్తారాని అన్నారు. ఏసీఎస్, ఏఎంసీచర్మన్లు రాంరెడ్డి, గీతాసింగ్, తహశీల్దార్ బుచ్చయ్య, ఉప తహశీల్దార్ శ్రీలత, ఆర్ఐలు రజిత, రాజు, మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, నాయకులు ఇక్బాల్, తలారి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

### రహదారి నిర్మాణంతో హర్షం..

**శంకర్‌పల్లి, జూన్ 16, ప్రభాతవార్త:** గత రెండు నెలలుగా శంకర్ పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు ఆర్ నరేష్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించి ఆర్డీవోకు ఫిర్యాదు చేసిన విషయంలో స్పందించిన అధికారులు ఎట్టకేలకు బ్రిడ్జిపై ఏర్పడిన గుంతలను పూడ్చడమే గాక వాటిపై తారు రోడ్డు వేయడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా శంకర్పల్లి నుండి ఫతేపూర్ బ్రిడ్జి వరకు గల ప్రధాన రోడ్డుపై ఏర్పడిన గుంతలను ఇంకా పూడ్చలేదు. ఈ రోడ్డు దుస్థితి వల్ల ఇద్దరు వ్యక్తులు చనిపోయిన విషయం అందరికీ తెలిసిందే. గమనించదగ్గ విషయం ఏమంటే ఈ గుంతలను కూడా పూడ్చి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించకుంటే ఆర్డీవోకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు స్థానిక మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద సేవ ఫౌండేషన్ సభ్యులు నిరాహార దీక్ష చేస్తారని నరేష్ కుమార్ హెచ్చరించారు. ప్రజలకుల సౌకర్యార్థం ధర్నా చేసిన సేవ ఫౌండేషన్ జనరల్ సెక్రెటరీ వేనేంద్ర చారి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు మహేందర్ రెడ్డి, కరాటే రవీందర్ యాదవ్, జన్వాడ రాజు, బసవరాజు, మేకన్ గడ్డ రాజు, గంగాధర్, ధాస్తగిరి తదితరులను ప్రజలు అభినందించారు.

### బెస్ట్ స్కూల్‌గా ఎంపిక శ్రీవిజ్ఞాన్ భారతి హైస్కూల్



**శామీర్‌పేట, జూన్ 16, ప్రభాతవార్త:** 2025-2026విద్యానంవత్సరం నకుగాను బెస్ట్ స్కూల్‌గా తూంకుంటలోని శ్రీవిజ్ఞాన్‌భారతి హైస్కూల్ ఎంపికైనట్లు ,ఎస్సీ డవలప్‌మెంట్‌కార్పోరేషన్ సహకారం తో సుమారు 25మందిఎస్సీ (బాల బాలికలు) విద్యార్థులకు1 వతరగతి లోప్రవేశ ంకల్పించి ఉచిత విద్యను అందించనున్నట్లు ఆపాఠశాలకరస్పాండెంట్ గోనె హనుమంతరెడ్డి పేర్కొన్నారు. సోమవారం శామీర్‌పేట మండలం తూంకుంటలోని శ్రీవిజ్ఞాన్ భారతిహైస్కూల్ కరస్పాండెంట్ ఈ విషయాన్ని తెలియజేశారు. 1వ తరగతిలో ప్రవేశం కోరే ఎస్సీ విద్యార్థుల తల్లిదండ్రులు కులం, ఆదాయ దృవీకరణ పత్రంతో విజ్ఞాన భారతి స్కూల్ ఆఫీస్‌లోసంప్రదించాలని కరస్పాండెంట్ గోనె హనుమంతరెడ్డి సూచించారు.

### ఆరు గ్యారంటీల అమలు ఎక్కడ?



**శంకర్‌పల్లి, జూన్16, ప్రభాతవార్త:** ప్రజా పాలన ప్రభుత్వం ఇస్తామన్నా ఆరు గ్యారంటీల అమలు ఎక్కడ అని సిపిఐ శంకర్ పల్లి మండల పార్టీ కార్యదర్శి సుధీర్ అన్నారు. మండల పరిధిలోని రావులపల్లి కలాన్ ,మోకిలా గ్రామాలలో గ్రామ శాఖ మహాసభలను ఉద్దేశించి సుధీర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు కావస్తున్న ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీల హామీలుఎక్కడని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నెలలు గడుస్తున్న కాలాయాపనతో ప్రజలను మభ్యపెట్టి గ్యారెంటీలను అమలుచేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలం అయిందని దుయ్య బట్టారు గ్రామాలలో అభివృద్ధి కొంటె పాటించండి ఏ గ్రామానికి వెళ్లిన రోడ్ల పరిస్థితి చాలా దారుణంగాఉందనిప్రమాదాలు జరుగుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. రావులపల్లి కలాం గ్రామ శాఖ కార్యదర్శిగా శేఖర్ సహాయ కార్యదర్శిగా మానయ్యా కమిటీ సభ్యులుగా సత్తయ్య చంద్రయ్య సుధాకర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని మోకిలా గ్రామ శాఖ కార్యదర్శిగా రామస్వామి సహాయ కార్యదర్శిగా కిష్టయ్యను కమిటీ సభ్యులు నరసింహులు రాజు వెంకటేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని ప్రకటించారు.

## బిజెపి పాలనలోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి

### బిజెపి జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజభూపాల్ గౌడ్



**షాబాద్, జూన్ 16, ప్రభాతవార్త:** భాజాపా పాలనలోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది ప్రపంచ దేశాలతో పోటీ పడుతోందని బిజెపి జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ భూపాల్ గౌడ్ అన్నారు. షాబాద్ మండల కేంద్రంలోనీ శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో బిజెపి ఆధ్వర్యంలో నిర్వహించిన తల్లికి వందనం కార్యక్రమంలో భాగంగా చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంచర్ల ప్రకాష్ తదితరులతో కలిసి సోమవారం మొక్కలు నాటారు. అనంతరం పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశం బిజెపి పాలనలో అవినీతి తగ్గి అన్ని రంగాల్లో అభివృద్ధి లో పయనిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన కాశ్మీర్లోని 370 ఆర్టికల్ ను మోడి ప్రభుత్వం రద్దుచేసి టూరిజాన్ని పెరిగేలా చేసిందన్నారు. ప్రపంచంలో ఆర్థిక వ్యవస్థలో 10వ స్థానంలో ఉన్న దేశాన్ని నాలుగో స్థానానికి తీసుకువచ్చింది బిజెపి ప్రభుత్వమేనని అన్నారు. వెయ్యి అబద్దాలాడి రాష్ట్ర ప్రభుత్వంలోకి వచ్చిన కాంగ్రెస్, పాలన చేతకాక చేతులెత్తేసిందని విమర్శించారు. రంగారెడ్డి జిల్లాలోని విలువైన ప్రభుత్వ భూములను అమ్మి రైతుబంధు వేసే పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని విమర్శించారు. హిందూ దేవాదాయ భూములను స్వాధీనం చేసుకొని రియల్ వ్యాపారం చేస్తున్న ప్రభుత్వం, వక్ఫ్ బోర్డ్ భూములను ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఓట్ల కోసం రాజకీయాలు చేసే కాంగ్రెస్ పార్టీకి వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. 2029లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి గెలుపొంది గోల్కొండ పై కాషాయం జెండా ఎగరవేస్తామన్నారు. అలాగే రేపటి స్థానిక సంస్థ ఎన్నికల్లో బిజెపి జిల్లా జిల్లా పరిషత్ ను కైవసం చేసుకోవడంతో పాటు, ఎక్కువ సంఖ్యలో ఎంపీటీసీలు గెలుపొంది ఎంపీపీ లను సాధిస్తామన్నారు. శ్యాం ప్రసాద్ ముఖర్జీ కి గుర్తుగాజిల్లాలో బిజెపి పార్టీ ఆధ్వర్యంలో లక్ష మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు మామయ్య, బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి మహేందర్, నాయకులు శ్రీధర్ రెడ్డి, రాము, హరీష్, విష్ణు, మహేష్, రవి గౌడ్, రాఘవేందర్, విక్రమ్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి, సురేష్, దయాకర్, రవి, శ్రీనివాస్, అనిల్ కుమార్, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయకేతనం ఎగరాలి

### ఎఐసిసిప్రధాన కార్యదర్శి విశ్వనాథ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎఐసిసి కార్యదర్శి విశ్వనాథ్

**నవాబుపేట జూన్ 16, ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగరాలని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్ పిలుపు నిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జై బాపు జై భీమ్ జై సంవిదాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయకు నాయకు లందరు ఘన స్వాగతం పలికారు. అనంతరం సమావేశంలో ఆయన మాట్లాడుతూ జై బాపు జై భీమ్ జై సంవిదాన్ కార్యక్రమంపై నాయకులకు కార్యకర్తలకు అవగాహన కల్పించారు. పార్లమెంట్ సాక్షిగా ఈ నినాధం ఉద్బవించిందని బీజేపీ పార్లమెంట్‌లో భారత రాజ్యంగ నిర్మాతపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఈ అరుదైనా కార్యక్రమాన్ని అధనేత రాహుల్‌గాంధీ రూపకల్పన చేశారని చెప్పారు. భారత్ జోడో మాత్ర ప్రపంచ చరిత్రలో నిలిచిపోయిందని అన్నారు. దాదాపుగా ఇండియా నుండి ఆమెరికా వెళ్ళినంత దూరం యాత్ర సాగించి అన్ని మతాలను, కులాలను ఆచార వ్యవహారాలను గౌరవిస్తూ సాగిన యాత్ర చరిత్ర సృష్టించిందని ఆయన అన్నారు. కాంగ్రెస్‌పార్టీ భారత రాజాంగాన్ని 75 ఎళ్ళుగా గౌరవిస్తూ ముందుకుసాగుతోందని ఆయన చెప్పారు. బీజేపీ అందుకు భిన్నంగా వ్యవహరిస్తూందని ఆయన ఆరోపించారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అంధిస్తున్నారని డైనమిక్ లీడరుగా ప్రసంశలు అందుకుంటున్న ఏకౌక సీఎం రేవంత్‌రెడ్డి అని కోనియాడారు. త్వరలో స్థానిక సమరానికి సమర శంఖం పూరించన్ను తరుణంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు విభేదాలను ప్రక్కన పెట్టి సమీష్టి కృషితో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషిచేయాలని పిలుపి నిచ్చారు. అందుకు ఉభయ జిల్లాల భాధ్యులు బాధ్యత వహించాలని చెప్పారు. అరమరికలతో పార్టీకి నష్టకలిగించకుండావ్యవహరించాలనిభిన్నత్వంలో ఏకత్వంలా వ్యవహరి ంచాలనితప్పకుండా పార్టీకోసం పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని ఆయన హామి ఇచ్చారు. ఇదిలా ఉండగా చేవెళ్ళ ఎమ్మెల్యే కాలె యాదయ్యకు సమావేశంలో స్థానం లేకపోవడాన్ని భరించని అభిమానులు కొంత అసహానం వ్యక్తం చేశారు. అధిష్టానం ఇంతటి నిర్లక్ష్యన్ని సహించడం సముచితంకాదని ఎమ్మెల్యేకు ఇది అవమానకరమైన ఆంశమని ఆరోపించారు. పార్టీలు మారడం సహజమని దానిని దృష్టిలో పెట్టుకుని అవమానరంగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని కొందరు వాధించారు. డీసీసీ అధ్యక్షుడు చల్ల నర్శింహరెడ్డి, టీపీసీసీ కార్యదర్శి దారసింగ్, జై బాపు జై భీమ్ జై సంవిదాన్ కోఆర్డీనేటర్ దెరిఫాం చైర్మన్ అమిత్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి ఉదయ్ మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గం ఇంచార్జీ పామెన భీంభరత్, పార్టీ మండల అధ్యక్షుడు చేడిపల్లి వెంకటయ్య, శంకర్‌పల్లి అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, వర్కింగ్ ప్రసిడెంట్ సామ వెంకట్‌రెడ్డి, అధికార ప్రతినిధి కొండల్‌యాదవ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు తలారి శేఖర్, సీనియర్ నాయకులు ఘనపురం ప్రసాద్, ఉపేందర్‌రెడ్డి, శివప్రసాద్, మాణయ్య, రఫి, రామకృష్ణ, వడ్డె రాములు, దాన నర్శింలు, సాయికుమార్, సంగారెడ్డి, పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలి



ఉచిత నోటు పుస్తకాలను అందజేస్తున్న మాధవానంద సరస్వతి స్వామీజీ

**కీసర, జూన్16, ప్రభాతవార్త:** విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలని మాధవానందసరస్వతిస్వామిఅన్నారు. నాగారం శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి ఆలయ చైర్మన్ మాదిరెడ్డి ప్రతాప్‌రెడ్డి ఆద్వర్యంలో విద్యార్దులకు నోటుపుస్తకాలను అందజేశారు. ఈ సందర్బంగా స్వామిజీ మాట్లాడుతూ విద్యార్దులకునైతికవిలువలు, భక్తి, అభ్యాసం అనే ముగ్గురు స్నేహితుల గురించి స్ఫూర్తిదాయకంగాసూచనలు చేశారు. విద్యార్దులలో విద్యాధ్యాస పెంపొందించ ందుకు నోటుబుక్స్ పంపిణీ మహత్తర కార్యక్రమమని స్వామీజీ పేర్కొన్నారు. ఈ సందర్బంగా ఆలయ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 23వ తేదీన నాగారం మున్సిపాలిటీలో గల హై స్కూల్, ప్రైమరీ స్కూల్, రాంపల్లి ప్రభుత్వ పాఠశాలలో సుమారు 2వేలమంది విద్యార్దులకు నోటు బుక్స్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్బంగా విద్యార్దులకు ఉచితంగా నోటుపుస్తకాలనుఅందజేసినమాదిరెడ్డిప్రతాప్‌రెడ్డినిస్వామీజీ అభినందించారు.

### ప్రజాసంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం

..డివిఎంసి మెంబర్ కిరణ్



కందనెల్లిలో ఇందిరమ్మ ఇళ్ళు ముగ్గు వేస్తున్న దృశ్యం

**పెద్దేముల్, జూన్16, ప్రభాతవార్త:** అభివృద్ధి, ప్రజాసంక్షేమం కాంగ్రెస్‌పార్టీతోనే సాధ్యమని తాండూరు నియోజకవర్గ డివిఎంసి మెంబర్ వి.కిరన్ అన్నారు. సోమవారం పెద్దేముల్ మండలం కందనెల్లిలో ఇందిరమ్మ ఇళ్ళ లబ్దిదారుల స్థలాలలో ముగ్గు వేసి ఇంటి నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్బంగా కిరన్ మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరికి నిరంతరం ఇళ్ళ మంజూరు ప్రక్రియ జరుగుతుందని అన్నారు. గత ప్రభుత్వంతో డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ళ పేరుతో పేదలతో ఆడుకున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాప్రభుత్వమని అందుకు అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేయడం జరిగిందని అన్నారు. సొంతింటి కల సాకారం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు శ్రీనివాస్‌చారీ, నాయకులు మధుసూధన్‌రెడ్డి, బోయిని హనుమంతు, వాజీద్, రమేష్ పంచాయతీ కార్యదర్శి నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఇందిరమ్మ రాజ్యం లోనే పేదల కలలు సాకారం

పిఎసిఎస్ చైర్మన్ జయకృష్ణ



లబ్దిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేస్తున్న పిఎసిఎస్ చైర్మన్ జయకృష్ణ.

**బొంరాస్‌పేట్ జూన్ 16, ప్రభాతవార్త:** ఇందిరమ్మ రాజ్యం లోనే పేదల కలలు సాకారం అవుతాయని మెట్లకుంట పీఏసిఎస్ చైర్మన్ జయకృష్ణ అన్నారు. సోమవారం మండల పరిధిలోని తుంకిమెట్ల గ్రామం లో మండల అభివృద్ధి అధికారి వెంకన్న గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పేదల సొంతింటి కల కలగానే మిగిలిందని ఆయన తీవ్రంగా విమర్శించారు. మాటిచ్చి మడమ తిప్పని సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ఇందిరమ్మ రాజ్యంలో పేదల సొంతింటి కల సాకరమవుతున్నదని చైర్మన్ అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ముఖ్య నాయకులు రామచంద్రా రెడ్డి, వెంకట్ రాములు గౌడ్, బాల్‌రాజ్ గౌడ్, బలిజ మల్లేష్, నరసింహనాయుడు, దేశ్యనాయక్, ఎంపిటి రవినాయక్ పాల్గొన్నారు.

### అభ్యున్నతి దిశగా సిఎం రేవంత్ రెడ్డి అడుగు



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంక్షేమ పథకాలు ప్రారంభిస్తున్న అధికారులు

**కొత్తూరు, ప్రభాతవార్త జూన్16 :** కొత్తూరు మండలంలోని తిమ్మాపూర్, ఇన్ముల్‌నర్వ రైతు వేదికలలో సోమవారం రైతులకు మేలు చేసే రైతు నేస్తం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా రైతు నేస్తం కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదేవిధంగా రైతు భరోసా పథకాన్ని ప్రారంభిస్తూ రైతులకు ఆర్థిక సహాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో షాద్‌నగర్ ఆర్డీవో ఎస్.ఆర్.సరిత, తహసీల్దార్ రవీందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బాలాజీ, మండల వ్యవసాయ అధికారులు గోపాల్, శంషాబాద్‌వ్యవసాయఅధికారిశ్వేత, కృష్ణవేణి, ఎంఆర్ఐలు రాంబాబు, సంజన, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హరినాథ్ రెడ్డి, సుదర్శన్ గౌడ్, పీఏసీఎస్ సీఈవో వినయ్, షాద్‌నగర్ మార్కెట్ కమిటీ డైరెటర్ రవి, ఏఈఓలు సుమలత, దీపకలు హాజరయ్యారు.

### రైతు నేస్తం కార్యక్రమానికి హాజరైన రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు

**తలకొండపల్లి జూన్ 16, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నాడు రైతునేస్తం కార్యక్రమాన్ని నిర్వహించడంతో తలకొండపల్లి మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో నీ రైతులు కాంగ్రెస్ పార్టీ నాయకులు భారీ హాజరైనారు, మండల పరిధిలోని గట్టు ఇప్పలపల్లి, వెల్జల్, తలకొండపల్లి గ్రామాల్లో నీ రైతు వేదికల వద్ద ఆయా గ్రామాల రైతులు పాల్గొని రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇస్తున్న సబ్సిడీలు, తదితర వివరాలకు సంబంధించి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టెలికాన్ఫరెన్స్ లో రైతులకు వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇస్తున్న మేలు గురించి ఆయన వివరించారు. ఇప్పటికే అందజేసిన రైతుల రుణమాఫీ, రైతుబంధు, వ్యవసాయ పనిముట్ల సబ్సిడీ తదితరు వివరాలపై టెలికాన్ఫరెన్స్ లో రైతులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి చక్రపాణి, సింగల్ విండో చైర్మన్ గట్లకేశవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు డోకరి ప్రభాకర్ రెడ్డి, రేన్ రెడ్డి, డేవిడ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మోహన్ రెడ్డి అజీమ్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శివపార్వతుల కళ్యాణం



ఉత్సవమూర్తులను తీసుకువస్తున్న ధర్మకర్తలు

**ఘట్‌కేసర్, జూన్ 16, ప్రభాతవార్త:**

ఘట్‌కేసర్ మున్సిపల్ ఎదులాబాద్‌లోని శ్రీభ్రమరాంబికా మల్లిఖార్జున స్వామి దేవాలయంలో సోమవారం శివపార్వతులకళ్యాణం ఘనంగా జరిగింది. ఆలయ 2వవార్షికోత్సవం సందర్భంగా భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు శ్యామ్‌కుమార్, మహేశ్‌కుమార్‌ల మంత్రోచ్చారణల మధ్య శివపార్వతుల ఉత్సవమూర్తులకు కళ్యాణం జిపించారు. పలువురు దంపతులు కళ్యాణంలో పాల్గొని స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. ఆలయ ధర్మకర్తలు కంట్లం గౌరీశంకర్, శివకుమార్‌లు కళ్యాణం, వార్షికోత్సవ పూజలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

## అధిక ఫీజులతో విద్యార్థుల తల్లిదండ్రులపై భారం

-విద్యాశాఖ అధికారులు సమస్యలను పట్టించుకోరా..?

-ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు వడ్ల శ్రీకాంత్



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

**షాద్‌నగర్, జూన్ 16, ప్రభాతవార్త:**

ప్రైవేటుపాఠశాలల్లో విద్యార్థులకు సంబంధించిన స్టేషనరీ, యూనిఫారాలను మార్కెట్ ధరలకు మించి విద్యార్థులకు విక్రయిస్తున్నారని, దీంతో అది విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం ఏర్పడుతుందని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు వడ్ల శ్రీకాంత్ ఆందోళన వ్యక్తంచేశారు. సోమవారం పట్టణంలోని నారాయణ, మేధా పాఠశాలలను ఎస్ఎఫ్ఐ నాయకులు తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వడ్ల శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రైవేటుపాఠశాలలు విద్యార్థులను పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫారాలను పాఠశాలల్లోనే కొనాలని ఒత్తిడి తెస్తున్నాయని, ఇది విద్యార్థుల తల్లిదండ్రులకు ఇబ్బందిగా మారిందని పేర్కొన్నారు. దీనిపై విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి విద్యార్థులకు న్యాయంచేయాలని అన్నారు. అదేవిధంగా కమర్షియల్ బిల్డింగ్‌లో నారాయణ స్కూల్‌ను ఎలా నడుపుతున్నారని, ఈపాఠశాలకు అనుమతులు ఎవరు ఇచ్చారో విద్యాశాఖ అధికారులు సమాధానం చెప్పాలని ఆయన ప్రకటన ద్వారా డిమాండ్‌చేశారు. ప్రైవేటుస్కూల్స్ యాజమాన్యాలు సౌకర్యాలపేరుతో అధికఫీజులు వసూలుచేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థికభారం మోపుతున్నాయని అన్నారు. వెంటనే విద్యాశాఖ అధికారులు స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్‌చేశారు. ఈకార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి శివశంకర్, సభ్యులు వినయ్, అశోక్, తరుణ్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన గొల్లపల్లి గ్రామస్థులు



ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న గొల్లపల్లి గ్రామస్థులు

**శంషాబాద్, జూన్ 16, ప్రభాతవార్త:**

శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని గొల్లపల్లి గ్రామస్థులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొడిగంటి చంద్రరెడ్డి. మాజీసర్పంచ్ జిట్టె సిద్దులు ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ శాసనసభ్యులు ప్రకాష్‌గౌడ్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్ బెంగళూరు జాతీయ రహదారిపై కిషన్‌గూడా నుండి గొల్లపల్లి గ్రామం మీదుగా పెద్ద గోల్కొండ చౌరస్తా వరకు 100ఫీట్ల రోడ్డువిస్తరణ పనులు జరుగుతున్నందున గ్రామస్థులందరూ ఎమ్మెల్యేను కలిసి మొరపెట్టుకున్నారు. 100ఫీట్ల రోడ్డు నిర్మాణంజరిగితే గొల్లపల్లిలోని అనేక ఇళ్ల నేలమట్టమవుతాయని నిరుపేద ప్రజలు ఇళ్ల స్థలాలు కోల్పోతారని గొల్లపల్లి గ్రామంలో 40ఫీట్ల వెడల్పుతో పనులు జరిగేలా చూడాలని విన్నవించారు. ఇల్లు కోల్పోయినవారికి 500గజాలకు తక్కువ లేకుండా ప్రత్యామ్నాయంగా స్థలం చూపించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ వెంటనే అధికారులను పర్యవేక్షించి తగినచర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో గ్రామ ప్రముఖులు మాచర్ల గణేష్. కమ్మరి చంద్రచారి, వెంకటేష్‌గౌడ్, యాదయ్య, బాలయ్య, బాల్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, మహేష్, రాజు, గౌతమ్ తదితరులు ఉన్నారు.

## మేడ్చల్‌లో బిజెపి సంకల్ప సభ



మేడ్చల్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న బిజెపి నాయకులు

**మేడ్చల్, జూన్ 16, ప్రభాతవార్త:**

ప్రధాని నరేంద్రమోడీ 11సంవత్సరాల సుపరి పాలనసందర్భంగా మేడ్చల్ మున్సిపాలిటీలో మున్సిపల్ బిజెపి అధ్యక్షురాలు జల్లి శైలజాహరి నాథ్ ఆధ్వర్యంలో బిజెపినాయకులతో సంకల్పసభ నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు కేంద్రప్రభుత్వం 11సంవత్సరాలు దేశంలో చేసిన అభివృద్ధి సంక్షేమపథకాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం పార్టీ అభ్యున్నతి కోసం నాయకులు ప్రతిజ్ఞచేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రవీందర్‌గౌడ్ కార్యకర్తలకు దిశానిర్దేశంచేశారు. కార్యక్రమంలో మేడ్చల్‌రూరల్ జిల్లా బిజెపి ఉపాధ్య క్షులు పాతూరి ప్రభాకర్‌రెడ్డి, జగన్‌గౌడ్, మండలపార్టీ మాజీఅధ్యక్షుడు కొండం ఆంజనేయులు, ప్రధానకార్యదర్శులు కానుకంటి వంశీ విజయ్, జాకట ప్రేమ్‌దాస్, ఉపాధ్యక్షులు మైసరి రాజు, సర్వేశ్వరరెడ్డి, నాయకులు రాగం అర్జున్‌బాబు, బొజ్జ రాఘవరెడ్డి, రతన్ రాథోడ్, బొజ్జ వంశీరెడ్డి, అవినాష్ చారి, దోసడీ రామచంద్రరెడ్డి, అర్జున్, దగ్గు రాజు, డి.సాయి, బండి విష్ణుగౌడ్, హేమలతరెడ్డి, అనిత, సాకరబోయిన వెంకటేష్, మామిళ్ళ నర్సింగ్‌రావు, పురుషోత్తం, మహేష్ గౌలికర్, మహేష్, పోతూ హరిబాబురెడ్డి, గోపు నాగరాజ్, జాకట బాబు, రాజు తదితరులు పాల్గొన్నారు.

# మూడుచింతలపల్లి రైతువేదిలో పాల్గొన్న కలెక్టర్

-వ్యవసాయ యూనివర్సిటీలో సిఎం రేవంత్‌రెడ్డి

-రైతునేస్తం ప్రారంభించి ప్రసంగించిన వైనం

-వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించిన కలెక్టర్, రైతాంగం



సిఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని వీక్షిస్తున్న మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి, పాల్గొన్న తదితరుల దృశ్యం

**శామీర్‌పేట, జూన్ 16, ప్రభాతవార్త:**

మూడుచింతపల్లి మండల రైతువేధిక నుంచి రైతులతో కలిసి రైతునేస్తం కార్యక్రమంలో మేడ్చల్ జిల్లాకలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి పాల్గొన్నారు. సోమవారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్‌లో రైతునేస్తం కార్యక్రమాన్ని సిఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించి ప్రసంగించటాన్ని జిల్లా కలెక్టర్, రైతులు పాల్గొని వీడియోకాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. అయితే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతువేదికల నుంచి రైతులు తిలకించేలా ఏర్పాటుచేయాలని ప్రభుత్వం సూచించటంతో దీనిలో భాగంగా మూడుచింతలపల్లి మండల రైతువేదికలో ఏర్పాటుచేసిన ప్రొజెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ రైతులతో కలిసిపాల్గొని వీక్షించారు. సిఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రసంగాన్ని రైతులు వీక్షించి హర్షం వ్యక్తంచేశారు. రైతాంగాన్ని ఆదుకునేవిధంగా రాష్ట్రప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని అన్నారు. ఈకార్యక్రమంలో జిల్లాకలెక్టర్ మనుచౌదరితోపాటు మేడ్చల్ వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఛైర్మన్ బి. నర్సింలుయాదవ్, జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ, జిల్లా హార్టికల్చర్ అధికారి శ్రీధర్, మండల తహసీల్దార్ వెంకట నర్సింహ్మారెడ్డి, ఎడి, ఎఓ, పలువురు రైతులు, పలువురు నాయకులు పాల్గొన్నారు. అయితే దీనికి ముందుగా మూడు చింతలపల్లి మండలానికి తొలిసారిగా జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి విచ్చేయటంతో మూడు చింతలపల్లి మండల తహసీల్దార్ వెంకటనర్సింహ్మారెడ్డి, జిల్లా డిఎఓ చంద్రకళ ఘనంగా స్వాగతం పలికారు.

## ప్రహరీగోడ, కిచెన్‌షెడ్ నిర్మాణానికి భూమిపూజ

-రూ.15 లక్షలతో పనులు ప్రారంభం..

వార్త కథనానికి స్పందన...



ప్రహరీగోడ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నాయకులు

**దుద్యాల్, జూన్ 16, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని ఈర్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ప్రహరీ గోడ, కిచెన్ షెడ్ నిర్మాణానికి (కడా) కొడంగల్ ఏరియా డెవలప్మెంట్ అథారిటీ నుండి నిధులు మంజూరు అయ్యాయి. గత నెల 23న పాఠశాలకు ప్రహరీ లేక... మందుబాబులకు అడ్డాగా... అని వార్త దినపత్రికలో కథనం ప్రచురితమైన విషయం పాఠకులకు విదితమే. స్పందించిన అధికారులు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అవుటి శేఖర్, పంచాయతీరాజ్ ఏఈ సురేందర్‌రెడ్డిలు రూ.10లక్షలతో ప్రహరీ గోడ నిర్మాణం, రూ.5లక్షలతో కిచెన్‌షెడ్ నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. పనుల్లో నాణ్యతను పాటించి, పనులు వెంటనే పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు ఆనందం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సూర్యప్రకాష్, కాంగ్రెస్‌పార్టీ ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు రవినాయక్, కాంగ్రెస్ పార్టీ మండల వైస్‌ప్రెసిడెంట్ కృష్ణ, మొగులయ్య, రాహుల్ పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్ళు

-టిపిసిసి ప్రధాన కార్యదర్శి ధారాసింగ్



ప్రొసీడింగ్ పత్రాలను అందజేస్తున్న ధారాసింగ్

**పెద్దేముల్, జూన్ 16, ప్రభాతవార్త:**

దేశంలో ఎక్కడలేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో అర్హులైన ప్రతిఒక్కరికి రూ. 5 లక్షలతో ఇందిరమ్మ ఇళ్ళు కట్టిస్తున్నామని టిపిసిసి ప్రధానకార్యదర్శి, మాజీ జడ్పిటిసి ధారాసింగ్ అన్నారు. సోమవారం పెద్దేముల్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో స్థానిక లబ్దిదారులకు ఇందిరమ్మ ఇళ్ళ ప్రొసీడింగ్ పత్రాలను ఆయన అందజేశారు. ఈసందర్భంగా ధారాసింగ్ మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చినహమీలను దశలవారీగా ప్రభుత్వం నెరవేరుస్తోందని అన్నారు. రుణమాఫీ, రైతుబంధు, ఇందిరమ్మ ఇళ్ళు తదితర పథకాలను అమలు చేస్తోందని అన్నారు. అందుకు ఇందిరమ్మ ఇళ్ళ లబ్దిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఇళ్ళను నిర్మించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లాలప్ప, టిపిసిసి మైనార్టీ కన్వీనర్ ఎండి రియాజ్, కాంగ్రెస్‌పార్టీ జిల్లా ఉపాధ్యాక్షులు ఎల్లారెడ్డి, ఇందిరమ్మ కమిటి సభ్యులు శోభారాణి, విద్యాసాగర్, శబ్బీర్, మార్కెట్ కమిటి మాజీ ఉపాధ్యాక్షులు జితేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఎర్రబాలప్ప, నాయకులు కోహీర్ రవి, కొళ్ళ గోపాల్, ఆనందచారీ, ఫయాజ్, ఎక్బాల్, బ్యాగరి మల్లేష్, కొళ్ళ పెంటప్ప, పడగల్ల రాజు, కారోబార్ నర్సిరెడ్డి పాల్గొన్నారు.

## పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతులు

'వార్త' కథనానికి స్పందన...



పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతులు చేస్తున్న దృశ్యం

**షాద్‌నగర్, జూన్ 16, ప్రభాతవార్త:**

ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో డ్రైనేజీ పైప్‌లైన్ లీకేజీతో రోడ్లపై మురుగు నీరు ప్రవహిస్తున్న విషయం 'వార్త' దినపత్రికలో 'పైప్‌లైన్ లీకేజీతో రోడ్లపై పారుతున్న మురుగు' శీర్షికతో వచ్చిన వార్తా కథనానికి మొగిలిగిద్ద గ్రామ పంచాయతీ సిబ్బంది స్పందించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి బాసిత్ గ్రామంలో పైప్‌లైన్ పనులను సమీక్షించారు. పైప్‌లైన్‌లో లీకేజీ సమస్య ఎక్కడుందో గుర్తించి జెసిబితో మరమ్మతులు చేయించారు. పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతులు చేయడంతో గ్రామానికి చెందిన కక్కునూరి వెంకటేష్ గుప్త, గుట్టరాజు తదితరులు మీడియాకు, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

## రైతుకు భరోసానిచ్చే ప్రభుత్వం

-కాంగ్రెస్ ప్రభుత్వంమార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రైతులు, అధికారులు, నాయకులు

**కేశంపేట, జూన్ 16, ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, షాద్‌నగర్ శాసన సభ్యుడు వీర్లపల్లి శంకర్ రైతులను రాజులు చేయాలనే ఉద్దేశంతో రైతుభరోసా కార్యక్రమానికి సోమవారం శ్రీకారంచుట్టారని అన్నారు. షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ టిప్పుశెట్టి కరుణాకర్, సోమవారం కేశంపేట మండల పరిధిలోని అల్వాల, లేమామిడి రైతువేదికల ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. రైతులతో ముఖాముఖి మాట్లాడుతూ సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో రైతుభరోసాకు నిధులను విడుదలచేశారు. ఈకార్యక్రమాలలో లేమామిడి రైతువేదికలో తహసీల్దార్ ఆజం అలీ, అల్వాల్ రైతువేదికలో వ్యవసాయ అధికారిణి శిరీష, అల్వాల్ మాజీ ఎంపిటిసి సురేష్‌రెడ్డి, వన్నాడ మనోహర్‌గౌడ్, శ్రీధర్‌రెడ్డి, ప్రశాంత్, నిఖిల్‌రెడ్డి, అవ్వ రాఘవేందర్, ఎఓ వినయ్, తిప్పసెట్టి దర్శన్, ఆనంద్, విజయేందర్‌రెడ్డి, మధు, కార్తీక్, నీలిమ, రాజు, శంకర్ నాయక్, రామయ్య, పర్వతాలు, మల్లేష్, రైతులు, అధికారులు పాల్గొన్నారు.

## రక్తదానం సూరికి సత్కారం

**ఘట్‌కేసర్, జూన్ 16, ప్రభాతవార్త:**

ఘట్‌కేసర్ మున్సిపల్ ఎన్ఎఫ్‌సినగర్‌కుచెందిన శిష్టా సూర్యనారాయణ రావును ఎన్‌టిఆర్ మెమోరియల్ ట్రస్టు నిర్వాహకులు సన్మానించారు. ఇటీవల జరిగిన మాజీముఖ్యమంత్రి ఎన్‌టి.రామారావుజయంతి సందర్భంగా సూర్యనారాయణరావు 122వసారి రక్తదానం చేశారు. హైదరాబాద్‌లోని ఎన్‌టిఆర్ మెమోరియల్ ట్రస్టులో 14న నిర్వహించిన ప్రపంచ రక్తదాన దినోత్సవంలో సూర్యనారాయణరావును సన్మానించి ప్రశంసాపత్రం అందజేశారు.

# 25ఏళ్ల కరెంటు తీగల సమస్యకు పరిష్కారం

-ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తోనే సాధ్యం

-ఆనందంలో పాపిరెడ్డిగూడ గ్రామస్థులు



పాపిరెడ్డిగూడ గ్రామస్థులు

**కేశంపేట, జూన్ 16, ప్రభాతవార్త:**

కేశంపేట మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో ఓ కీలక సమస్యకు వారంరోజుల్లోనే పరిష్కారం దొరకడం ఆనందకరం, గ్రామంలోని ఇళ్లపైనుండి నడుస్తున్న 11 కిలో వోల్ట్ విద్యుత్ తీగలు గ్రామప్రజల జీవనాన్ని భయాందోళనకు గురిచేస్తున్న పరిస్థితిలో, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చొరవతో సమస్యకు ముగింపు లభించింది. ప్రజల నిత్యజీవితాన్ని ప్రభావితం చేస్తున్న ఈసమస్య తక్షణమే పరిష్కరించబడటంతో గ్రామస్థుల ఆనందాలకు హద్దులు లేవు. గ్రామంలో దాదాపుగా 30 ఇళ్లపై నుంచి నడుస్తున్న 11 కెవి హైవోల్టేజ్ విద్యుత్ తీగలు గత కొన్ని సంవత్సరాల కాలంగా గ్రామస్థుల ప్రశాంతజీవితంపై మబ్బులామారాయి. విద్యుత్ తీగలు అతిసమీపంలో ఉండటంతో గ్రామస్థులు భయంగుప్పెట్లో జీవించేవారు. వర్షాకాలంలో మరింత ప్రమాదం ఏర్పడే పరిస్థితి తలెత్తింది. ఇంట్లో ఉండేవారంతా ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకుని భయంభయంగా జీవించాల్సిన దుస్థితి ఉండేది. ఈసమస్యను పరిష్కరించాలనే సంకల్పంతో గ్రామస్థులు ఏకమై స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌నుకలిసి వినతిపత్రం సమర్పించారు. తమకు ఎదురవుతున్న సమస్యను వివరిస్తూ, భవిష్యత్తులో తలెత్తే ప్రమాదాలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే ప్రజల భద్రతకు మొదటి ప్రాధాన్యతనిస్తానంటూ, సమస్యను తక్షణమే పరిష్కరించేందుకు తగినచర్యలుతీసుకుంటానని హామీ ఇచ్చారు. ఆయన ఆదేశాలతో విద్యుత్‌శాఖ అధికారులు వెంటనే రంగంలోకి దిగారు. వినతిపత్రం అందిన వారంరోజుల్లోనే సంబంధిత అధికారులు 11కెవి విద్యుత్ తీగల మార్గాన్నిమార్చి, గ్రామస్థుల ఇళ్లపై నుంచి తొలగించారు. ఇది గ్రామంలో ఒక కీలకమైన మైలురాయిగా నిలిచింది. విద్యుత్ తీగలు తొలగించబడిన తర్వాత, ఊరంతా హర్షాతిరేకంతో నిండిపోయింది. ప్రజల సమస్యను అర్థం చేసుకుని వెంటనే స్పందించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు, గ్రామస్థులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు, సహకరించిన కేశంపేట మాజీ జడ్పిటిసి తాండ్ర విశాలశ్రవణ్‌రెడ్డికి గ్రామస్థులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

కార్యక్రమంలో గ్రామస్థులు మాజీసర్పంచ్ శివయ్య, మాజీ ఉప సర్పంచ్ అబ్బి సుందరయ్య, పల్లాటి లక్ష్మీనారా యణ, చేవెళ్ల నర్సింలు, సూరమోని యాదయ్య, కురువగూడెం నర్సింలు, చేవెళ్ల యాదయ్య, విష్ణగారి రాఘవేందర్, కుమ్మరి శేఖర్, సురమోని పర్వతాలు, లేకపోతుల సుదర్శన్‌గౌడ్, సిల్వేరు రవీందర్, దేవేందర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ప్రోటోకాల్ పాటించని అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు

-నీటి సమస్యను పరిష్కరించాలని వినతి



అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న అఖిలపక్ష నాయకులు

**ఘట్‌కేసర్, జూన్ 16, ప్రభాతవార్త:**

ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో నెలకొన్న మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ అఖిలపక్షనాయకులు సోమవారం మేడ్చల్‌జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈమేరకు మేడ్చల్‌జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజావాణి కార్యక్రమంలో మాజీ ఎంపిపి-మున్సిపల్ బిఆర్‌ఎస్‌పార్టీ అధ్యక్షులు బండారి శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ బిజెపి అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్‌రెడ్డి, మండల టిడిపి అధ్యక్షు లు వేముల సంజీవగౌడ్ తదితరులు అదనపుకలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. అంతకుముందు జిల్లాకలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన మను చౌదరిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించారు. ఘట్‌కేసర్ మున్సిపల్‌లో అధికారులు ప్రోటోకాల్‌పాటించకుండా మాజీ ప్రజాప్రతినిధులు, అధికారపార్టీ నాయకులను ఆధికారిక కార్యక్రమాల్లో పాల్గొనేవిధంగా చేస్తున్నారని తెలిపారు. వారిపై చర్యలుతీసుకోవాలని కోరారు. ఘట్‌కేసర్ మున్సిపల్‌లో నీటిసమస్యపై వేసవికాలానికి ముందే అధికారులకు తెలియజేసినా అధికారులు నిర్లక్ష్యం చేశారని తెలిపారు. వినతిపత్రం అందజేసినవారిలో మాజీ ఎంపిటిసి మేకల నర్సింగ్‌రావు, నాయకులు పల్లె మధుసూధన్‌గౌడ్, కందాడి సుదర్శన్‌రెడ్డి, కట్ట హరినాథ్‌రెడ్డి, అనిల్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

## ముత్యాలమ్మ ఆలయ నిర్మాణానికి లక్ష రూపాయలు బహూకరణ



ఆలయ అభివృద్ధికి బట్టు శ్రీనివాస్ చెక్కు అందజేస్తున్న దృశ్యం

**యాచారం, జూన్ 16, ప్రభాతవార్త:**

ఆలయ నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బట్టు శ్రీనివాస్‌ముదిరాజ్ లక్షరూపాయలను సోమవారం బహూకరించారు. యాచారం మండలపరిధిలోని మాల్‌కేంద్రంలోగల బుడగజంగాల కాలనీలోని ముత్యాలమ్మ ఆలయ నిర్మాణానికి తనవంతుగా కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బట్టు శ్రీనివాస్‌ముదిరాజ్ కాలనీవాసుల సమక్షంలో లక్షరూపాయలు అందజేసి ఆలయ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామంలో ఆలయాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం సేవాదళ్ ఉపాధ్యక్షులు గొల్లపల్లి భాస్కర్‌గౌడ్, పార్టీ నాయకులు కొప్పుల వెంకటేష్‌గౌడ్, బెడ బుడగజంగాల సంఘం అధ్యక్షులు కడమంచి రాజు, ఆనరాశి రాజు, అనరాశి శ్రీనివాస్, అలరాశి మురళి, కడమంచి శివ, మోతే రమేష్, మిర్యాల కృష్ణ, మిరియాల రమేష్, కడమంచి జంగయ్య, కడమంచి యాదగిరి, నిదానకవి శివ, విప్ప కృష్ణ, రామాంజనేయులు, విప్ప మహేందర్, మోతి కృష్ణ, మిర్యాల గోపి, ఇప్ప శివ, కడమంచి శివకుమార్, వినయ్‌కుమార్, అజయ్‌కుమార్, స్వరూప, రాజు, చందు తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీ కాంగ్రెస్ బలోపేతానికి సహకరించండి

-ఆదివాసీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శ్రీనునాయక్

-కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కలిసిన శ్రీనునాయక్



ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సన్మానిస్తున్న శ్రీనునాయక్

**షాద్‌నగర్, జూన్ 16, ప్రభాతవార్త:**

కల్వకుర్తి నియోజకవర్గంలో ఆదివాసీ కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలని ఆదివాసీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శ్రీనునాయక్ కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కోరారు. సోమవారం హైదరాబాద్‌లోని ఆయనస్వగృహంలో కలుసుకొని ఆయనను శాలువాతో సన్మానించారు. ఈసందర్భంగా శ్రీనునాయక్ పేర్కొంటూ జిల్లాలో కల్వకుర్తి నియోజకవర్గంలో ఆదివాసీల జనాభా ఎక్కువగా ఉందని, అక్కడి తండాల అభివృద్ధికి కాంగ్రెస్‌ప్రభుత్వం చేపట్టిన అనేక సంక్షేమ పథకాలు వారికి అందేలా చూడాలని ఎమ్మెల్యేను కోరారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గిరిజనులకు సముచిత స్థానం కల్పించాలని కోరినట్లు వివరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి స్పందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటులో గిరిజనుల పాత్ర కీలకంగా ఉందని, వారికి సరైన న్యాయం చేస్తానని, ప్రభుత్వపరంగా వచ్చే అన్ని రకాల అభివృద్ధి ఫలాలను అందించేందుకు కృషిచేస్తానని, వారిని రాజకీయపరంగా గుర్తించి సముచిత స్థానం కల్పిస్తానని హామీ ఇచ్చినట్లు శ్రీనునాయక్ పేర్కొన్నారు. ఈసందర్భంగా శ్రీనునాయక్ ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ స్థానిక నాయకులు బాలునాయక్, హరినాయక్, లాలూనాయక్, కిషన్‌సింగ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి రైతునేస్తం ముఖాముఖిలో పాల్గొన్న రైతులు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రైతులు, స్థానికులు, నాయకులు

**యాచారం, జూన్ 16, ప్రభాతవార్త:**

యాచారం మండల కేంద్రంలో గల రైతు వేదిక చౌదర్పల్లి రైతు వేదికలలో ముఖ్యమంత్రితో ముఖాముఖి రైతు నేస్తం కార్యక్రమంలో వివిధ గ్రామాల రైతులు హాజరై సోమవారం పాల్గొన్నారు. యాచారం తాసిల్దార్ అయ్యప్ప, మండల వ్యవసాయ అధికారి రఘునాథ్, పిఎసిఎస్ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు వివిధ గ్రామాల మాజీ ఎంపీటీసీలు సర్పంచులు రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు. జూన్ 16 నుండి రైతు భరోసా రైతుల ఖాతాలో జమ కానున్నట్లు ముఖాముఖి ద్వారా తెలుసుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో వానాకాలం సాగు సీజన్ కు రైతు భరోసా కింద వచ్చే పెట్టుబడి సాయం జూన్ 16 నుంచి రైతు ఖాతాలో జమమైతాయని హామీ ద్వారా తెలుసుకున్నారు. రైతు భరోసా కార్యక్రమంలో నేటికీ దరఖాస్తు చేసుకొని వారు దరఖాస్తు చేసుకోవాలని అందరికీ రైతు భరోసా అందుతుందని పేర్కొన్నారు.